# వైరుధ్యాల

## మావో-సే-టుంగ్



# వైరుధ్యాలు

**ఆగస్టు, 1937**

వస్తువులలోని వైరుధ్యాల సూత్రమే, అంటే విరుద్ధాంశాల ఐక్యతా సూత్రమే భౌతిక గతితర్కానికి మూలసూత్రం. "గతితర్కం అంటే వాస్తవానికి, వస్తువుల అసలు సారంలోని వైరుధ్యాలను అధ్యయనం చేయడమే." అని లెనిన్ అన్నారు.[1] లెనిన్ తరచుగా ఈ సూత్రాన్ని గతితర్క సారమనీ, గతితర్కపు మూలకందమనీ అన్నారు.[2] అందువల్ల ఈ సూత్రాన్ని అధ్యయనం చేసేటపుడు, మనం వివిధ ప్రశ్నలనూ, అనేక తాత్విక సమస్యలనూ తడమక తప్పదు. ఈ సమస్యలన్నింటినీ గూర్చి మనం స్పష్టంగా తెలుసుకోగల్గితే, భౌతిక గతితర్క శాస్త్రపు మౌలిక అవగాహన మనకు కలుగుతుంది. ఆ సమస్యలు యివి : రెండు ప్రాపంచిక దృక్పథాలు; వైరుధ్యం యొక్క విశ్వజనీనత (universality); వైరుధ్యం యొక్క ప్రత్యేకత (particularity); ప్రధాన వైరుధ్యమూ, వైరుధ్యంలోని ప్రధాన అంశాం మధ్య ఐక్యత (identity) ఘర్షణ, వైరుధ్యంలో వైషమ్యానికి వున్న స్థానం.

డిబోరిన్ సాంప్రదాయపు (school) భావవాదం గురించి సోవియట్ తాత్విక వర్గాలలో ఇటీవల బయలుదేరిన విమర్శలు మనలో ఎంతో ఆసక్తిని ప్రేరేపించాయి. డిబోరిన్ భావవాదం, చైనా కమ్యూనిస్టు పార్టీ మీద గొప్ప దుష్ప్రభావాన్ని కలిగించింది. మన పార్టీలోని పిడివాద ఆలోచనా పద్ధతికీ, ఈ సాంప్రదాయపు (school's) వైఖరికి సంబంధమే లేదని అనుకోడానికి అవకాశంలేదు. కనుక పిడివాద ఆలోచనా పద్ధతిని నిర్మూలించడమే మన ప్రస్తుత తత్వశాస్త్ర అధ్యయనానికి ముఖ్య లక్ష్యంగా వుండాలి.

---

కామ్రేడ్ మావో, ఈ తాత్విక వ్యాసాన్ని 1937 ఆగస్టులో రచించారు. దీనికి ముందు వ్రాసిన "ఆచరణ" అన్న వ్యాసంలానే, ఇది కూడా, ఆ సమయంలో పార్టీలో నెలకొనివున్న పిడివాద ఆలోచనా ధోరణుల తీవ్రమైన పొరబాట్లను ఖండించడానికి ఉద్దేశింపబడింది. తొలుత, యేనాన్‌లోని జపాను వ్యతిరేక సైనిక, రాజకీయ కళాశాలలో యివ్వబడిన ఈ ప్రసంగాలను కామ్రేడ్ మావో, అటుతర్వాత, ప్రచురణార్థం సవరించారు.

## 1. రెండు ప్రాపంచిక దృక్పథాలు

మానవ విజ్ఞాన చరిత్ర అంతటా, ప్రపంచం అభివృద్ధి సూత్రానికి సంబంధించి రెండు రకాల భావనలు వుంటూ వచ్చాయి - అధి భౌతిక భావన, గతితార్కిక భావన, ఇవి పరస్పరం విరుద్ధమైన రెండు ప్రాపంచిక దృక్పథాలు. లెనిన్ ఇలా అన్నారు :

"అభివృద్ధి (పరిణామం)ని గురించి వున్న (లేక ఉండే అవకాశం వున్న రెండు ? లేదా చారిత్రకంగా గమనించ గల్గిన ?) రెండు మూల భావనలు ఇవి : వృద్ధి క్షయాలుగానూ, పునరావృతంగానూ వుండే అభివృద్ధి మరియూ, విరుద్ధాంశాల ఐక్యత (ఐక్యత, పరస్పరం నిరాకరించుకునే, విరుద్ధాంశాలు [mutually exclusive]గా విభజించబడడం, వాటి పరస్పర సంబంధం)గా వుండే అభివృద్ధి"[3].

ఇందులో లెనిన్ రెండు విభిన్న ప్రాపంచిక దృక్పథాల గురించే ప్రస్తావిస్తున్నాడు.

చైనాలో అధిభౌతిక వాదానికి 'సు ఆన్-సుసే' అనే మరో పేరుంది. చైనాలో ఏమిటి, యూరోప్‌లో ఏమిటి, చరిత్రలో బహు దీర్ఘకాలం, భావవాద ప్రాపంచిక దృక్పథంలో అంతర్భాగమైన ఈ ఆలోచనా పద్ధతి, మానవ చింతనలో ప్రముఖ స్థానాన్నే ఆక్రమించింది. యూరప్‌లో, బూర్జువా వర్గపు భౌతికవాదం కూడా, తొలి కాలంలో, అధి భౌతికంగానే వుండింది. యూరప్‌లోని అనేక దేశాల సామాజిక ఆర్థిక వ్యవస్థ బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దశకు పురోగమించేకొద్దీ, ఉత్పత్తి శక్తులూ, వర్గపోరాటమూ, విజ్ఞానశాస్త్రీలూ, చరిత్రలో ఏనాడూ లేనంత స్థాయికి అభివృద్ధిచెందిన కొద్దీ, పారిశ్రామిక కార్మికవర్గం, చరిత్రను అభివృద్ధి చేయడంలో అత్యుత్తమ చోదకశక్తిగా అయినకొద్దీ, మార్క్సిస్టుల ప్రాపంచిక దృక్పథమైన, భౌతిక గతితర్కం ఆవిర్భవించింది. అపుడు, భౌతిక గతితర్కాన్ని ప్రతిఘటించడానికి బహిరంగమూ, లజ్జారహితమూ అయిన అభివృద్ధి నిరోధక భావవాదానికి తోడుగా, బూర్జువా వర్గాలలో క్షుద్రపరిణామవాదం ఒకటి బయలుదేరింది.

అధిభౌతిక లేదా క్షుద్ర పరిణామవాదుల ప్రాపంచిక దృక్పథం, వస్తువులను, ఒకదానితో మరోదానికి సంబంధం లేనివి (isolated), ఎదుగూబొదుగూ లేనివి, (static), ఏకపక్షమైనవీగా చూస్తుంది. అది, ప్రపంచంలోని సమస్త వస్తువులనూ, వాటి రూపాలనూ, వాటి జాతులనూ, ఎప్పటికీ వేటికవిగానే వుండిపోయేవిగానూ మారనివిగానూ భావిస్తుంది. మార్పు అంటూ ఏమైనా వుంటే పరిమాణంలో పెరుగుదల



గానీ తగ్గుదలగానీ వుండవచ్చు, లేదా స్థానచలనం జరగవచ్చు. అంతేకాదు అటువంటి పెరుగుదలకూ, తరుగుదలకూ, స్థల చలనానికి కారణం ఆ వస్తువులలో వుండదు, వాటికి బాహిరంగా వుంటుంది. అంటే చోదకశక్తి బాహ్యమైనది అనీ, ప్రపంచంలోని వివిధ వస్తువులు, వాటి లక్షణాలు అవి అస్తిత్వంలోకి వచ్చిన నాటి నుండి అలాగే వుండిపోయాయని అధిభౌతికవాదులు భావిస్తారు. దరిమిలా జరిగే మార్పులన్నీ, కేవలం పరిమాణంలో హెచ్చుతగ్గులు మాత్రమేనని, ఒక వస్తువు తిరిగి తిరిగి అదేరకం వస్తువుగా పునరావృతమవగలదేగానీ, మరో భిన్నమైన వస్తువుగా మారజాలదని వారు వాదిస్తారు. పెట్టుబడిదారీ దోపిడీ, పెట్టుబడిదారీ పోటీ, పెట్టుబడిదారీ సమాజంలోని వ్యక్తివాదమూ, మొదలైనవాటన్నిటినీ పురాతన బానిస సమాజంలోనూ, లేదా ఆదిమ సమాజంలో సైతమూ చూడవచ్చని అవి మార్పు లేకుండా శాశ్వతంగా వుండబోతాయని వారు అభిప్రాయపడ్తారు. సమాజాభివృద్ధికి, సమాజానికి బాహిరమైన, భౌగోళిక, వాతావరణ సంబంధమైన అంశాలవంటి అంశాలే కారణభూతాలవుతాయని వారి వాదం. ఒక వస్తువు అభివృద్ధికి కారణాం కోసం వారు అతి చులాగ్గా ఆ వస్తువు వెలుపల వెతుకుతారు. ఒక వస్తువులోని అంతర్గత వైరుధ్యాల నుండే అభివృద్ధి ఆవిర్భవిస్తుందని భావించే, భౌతిక గతితర్క సిద్ధాంతాన్ని వారు తిరస్కరిస్తారు. ఆ కారణంచేత వారు వస్తువుల గుణాత్మక వైవిధ్యాన్ని గానీ, ఒక గుణం ఇంకో గుణంగా మారడం అనే పరిణామాన్నిగానీ వివరించలేరు. యూరోప్‌లో ఈ రకం ఆలోచనా విధానం, 17, 18 శతాబ్దాలలో యాంత్రిక భౌతిక వాదంగానూ, 19వ శతాబ్ది అంతంలోనూ 20వ శతాబ్దం ప్రారంభంలోనూ క్షుద్ర పరిణామ వాదంగానూ చలామణీ అయింది. చైనాలో "నాకం మారదు, అదే తీరులో తావో (tao-మార్గం) మారదు"[4] అనే సూక్తిలో వ్యక్తమయిన అధిభౌతికవాద ఆలోచనా విధానం ఒకటి వుండేది. క్షీణదశలో వున్న భూస్వామ్య పాలకవర్గాలు దాన్ని చాలాకాలంపాటు బలపరిచాయి. గడిచిన నూరేండ్లలో యూరపునుండి దిగుమతి అయిన యాంత్రిక భౌతిక వాదాన్ని, క్షుద్ర పరిణామ వాదాన్ని బూర్జువాలు బలపరిచారు.

భౌతిక గతితార్కిక ప్రాపంచిక దృక్పథం, అధిభౌతిక ప్రాపంచిక దృక్పథానికి విరుద్ధంగా ఒక వస్తువు అభివృద్ధిని అర్థంచేసుకోడానికి, మనం దాని అంతర్యాన్ని, ఇతర వస్తువులతో దానికి గల సంబంధాలనూ, అధ్యయనం చేయాలని భావిస్తుంది. అంటే వస్తుజాలం తాలూకు, అభివృద్ధిని, వాటి అంతర్గతమైన,

అవశ్యకమైన స్వయంచలనంగానే చూడాలి, కాగా, ప్రతివస్తువూ దాని చలనంలో, దానిచుట్టూ వున్న వస్తువులతో సంబంధం కలిగివుండి వాటిని ప్రభావితంచేస్తుంది; వాటి ప్రభావానికి లోనవుతుంది. ఒక వస్తువు అభివృద్ధికి మూలకారణం అంతర్గతమే కాని బాహిరంకాదు. అది వస్తువులలోనే వున్న వైరుధ్యశీలత (contradictoriness) లోనే వుంది. ప్రతి ఒక్క వస్తువులోనూ అంతర్గత వైరుధ్యం వుంటుంది. దాని చలనానికి, అభివృద్ధికి అదే కారణం. ఒక వస్తువులోని వైరుధ్యశీలతే (contradictoriness) దాని అభివృద్ధికి మూలకారణం. కాగా, ఇతర వస్తువులతో దాని పరస్పర సంబంధాలు, పరస్పర ప్రభావాలు, ద్వితీయ కారణాలవుతాయి. ఈ విధంగా భౌతిక గతితర్క శాస్త్రం, అధిభౌతిక, యాంత్రిక భౌతిక వాదులు, క్షుద్రపరిణామవాదులు చెప్పే బాహ్యకారణ సిద్ధాంతాన్ని, లేదా బాహిరమైన నోదక శక్తి సిద్ధాంతాన్ని సమర్థవంతంగా కొట్టిపారేస్తుంది. కేవలం బాహ్యకారణాలు యాంత్రిక చలనానికి మాత్రమే దారితీయగలవనీ, అంటే స్థాయిలో లేదా పరిమాణం లోని మార్పులకు మాత్రమే దారితీయగలదనేది స్పష్టమే — అయితే, వస్తువులు ఎందుకు అసంఖ్యాక పద్ధతులలో గుణాత్మకంగా భిన్నంగా ఉంటాయో ఒక వస్తువు ఎందుకు ఇంకో వస్తువుగా మారుతుందో అవి వివరించలేవు. వాస్తవానికి బాహిర శక్తులవల్ల సంభవించే యాంత్రిక చలనం కూడా వస్తువులలోని అంతర్గత వైరుధ్య శీలత ద్వారానే జరుగుతుంది. మొక్కలు, జంతువులలోని మామూలు పెరుగుదల, వాటి పరిమాణాత్మక అభివృద్ధి, అదే విధంగా ప్రధానంగా వాటిలోని అంతర్గత వైరుధ్యాల ఫలితమే. అదేవిధంగా సామాజికాభివృద్ధి, ప్రధానంగా అంతర్గత కారణాలవల్లే జరుగుతుంది కానీ, బాహిరకారణాల వల్ల కాదు. దాదాపుగా ఒకే విధమైన భౌగోళిక, వాతావరణ పరిస్థితులున్న దేశాలు కూడా వాటి అభివృద్ధిలో ఎంతో వైవిధ్యాన్ని, అసమానతనూ గోచరింపచేస్తాయి. అంతేగాక ఒకదేశపు భౌగోళిక, వాతావరణ పరిస్థితిలో ఎలాంటి మార్పులూ కలగకపోయినా, గొప్ప సామాజిక మార్పులు జరగవచ్చు. సామ్రాజ్యవాద రష్యా, సోషలిస్టు సోవియట్ యూనియన్‌గా మారింది, ప్రపంచానికి తలుపులు మూసవేసిన ఫ్యూడల్ జపాను, సామ్రాజ్యవాద జపానుగా మారింది. కానీ ఈ రెండు దేశాలలోనూ భౌగోళికంగా గానీ, వాతావరణంలోగానీ ఏ మార్పులూ జరగలేదు. దీర్ఘకాలం భూస్వామ్య ఆధిపత్యం కింద నలిగిన చైనా, గత నూరు సంవత్సరాలలో అనేక గొప్ప మార్పులకు లోనయింది, విముక్తమైన, స్వతంత్రమైన, నవచైనా దిశగా ఈనాడు మారుతోంది. అయినా దాని భౌగోళిక, వాతావరణ పరిస్థితుల్లో ఏ మార్పూ



జరగలేదు. భూమి అంతటా, ప్రతిభాగంలోనూ భౌగోళికంగానూ వాతావరణంలోనూ మార్పులు జరుగుతూనే వుంటాయి. అయితే సమాజంలోని మార్పులతో పోలిస్తే అవి పెద్దగా లెక్కలోకి వచ్చేవికావు. భౌగోళిక, వాతావరణపు మార్పులు, సహస్రాబ్దాలలో వ్యక్తమవుతాయి కాగా సామాజిక మార్పులు సహస్రాబ్దాలలోనూ, శతాబ్దాలలోనూ, లేదా దశాబ్దాలలోనూ, విప్లవ కాలాల్లో కొద్ది సంవత్సరాల్లో లేదా కొద్దినెలల్లో వ్యక్తమవుతాయి. భౌతిక గతితర్కం ప్రకారం, ప్రకృతిలోని మార్పులు, ప్రకృతిలోని అంతర్గత వైరుధ్యాల అభివృద్ధి కారణంగానే ప్రధానంగా జరుగుతాయి. సమాజంలోని మార్పులు, ప్రధానంగా, సమాజంలోని అంతర్గత వైరుధ్యాల, అంటే ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య వైరుధ్యం, వర్గాల మధ్య వైరుధ్యం, కొత్తకు పాతకు మధ్య వైరుధ్యాల అభివృద్ధి కారణంగానే జరుగుతాయి. సమాజాన్ని ముందుకునెట్టి, పాత సమాజాన్ని తొలగించి దాని స్థానాన్ని కొత్త సమాజం ఆక్రమించడానికి ప్రేరణ కలిగించేది, ఈ వైరుధ్యాల అభివృద్ధే. భౌతిక గతితర్కం బాహ్యకారణాలను లెక్కలోకి తీసుకోదా? ఏంతమాత్రమూ కాదు. బాహ్యకారణాలు మార్పుకు షరతు అనీ, అంతర్గత కారణాలు మార్పుకు పునాది అనీ, బాహ్య కారణాలు అంతర్గత కారణాల ద్వారానే పని చేస్తాయనీ అది భావిస్తుంది. తగిన ఉష్ణోగ్రత దగ్గర, గుడ్డు కోడిపిల్లగా మారుతుంది, కాని ఏ ఉష్ణోగ్రతా రాయిని కోడి పిల్లగా మార్చలేదు. ఆ రెండింటి ప్రాతిపదికలూ వేరువేరువి అవడమే అందుకు కారణం. వేరువేరు దేశాల ప్రజల మధ్య నిరంతరాయంగా పరస్పర ప్రభావం వుంది. పెట్టుబడిదారీ యుగంలో ప్రత్యేకించి సామ్రాజ్యవాదం, శ్రామిక వర్గవిప్లవాల యుగంలో, విభిన్నదేశాల రాజకీయ. ఆర్థిక సాంస్కృతిక రంగాలలో, పరస్పర సంపర్కం, పరస్పరం ప్రభావితం చేసుకోవాలు, చాలా ఎక్కువగా ఉంటుంది. అక్టోబరు సోషలిస్టు విప్లవం రష్యా చరిత్రలోనే గాక, ప్రపంచ చరిత్రలోనే ఒక నూతన యుగాన్ని ప్రవేశపెట్టింది. ప్రపంచంలోని ఇతర దేశాలలోని అంతర్గత మార్పులమీద దాని ప్రభావం పడింది. అదే విధంగానూ, మరింత ప్రగాఢంగానూ చైనాలోని అంతర్గత మార్పులమీద దాని ప్రభావం పడింది. అయితే ఈ మార్పులు ఆయా దేశాల అభివృద్ధి తాలూకు అంతర్గత సూత్రాల వలన ప్రభావితమయ్యాయి. చైనాలో కూడా అదే జరిగింది. యుద్ధంలో ఒకపక్షం గెలుస్తుంది రెండవది ఓడిపోతుంది. గెలుపు, ఓటమి రెండూ కూడా అంతర్గత కారణాల చేతనే నిర్ణయమవుతాయి. బలంగా వుండటం చేతనో లేదా సమర్థవంతమయిన నాయకత్వం వుండటం వల్లనో ఒక పక్షం విజేత అవ్వచ్చు. బలహీనమైనది కాబట్టో లేదా

అసమర్ధ నాయకత్వం వల్లనో రెండోపక్షం ఓడిపోయి ఉండవచ్చు. బాహ్యకారణాలు అంతర్గత కారణాల ద్వారానే పనిచేస్తాయి. చైనాలో 1927 లో, బూర్జువావర్గం, కార్మికవర్గాన్ని ఓడించడం, ప్రధానంగా చైనా శ్రామిక వర్గంలోనే (చైనా కమ్యూనిస్టు పార్టీలో) అపుడు నెలకొన్న అవకాశవాదం మూలానే సాధ్యమయింది. మనం ఈ అవకాశవాదాన్ని తుడిచిపెట్టేసిన తర్వాత, చైనా విప్లవం మళ్ళీ తన పురోగతిని కొనసాగించింది. అటు తర్వాత మన పార్టీ లోపల దుస్సాహసిక తత్వం తలయెత్తిన కారణంగా చైనా విప్లవం శత్రువు చేతిలో తీవ్రమైన ఎదురుదెబ్బలు తింది. మనం ఈ దుస్సాహసిక తత్వాన్ని నిర్మూలించిన తర్వాత మన ఆశయం తిరిగి పురోగమించింది. అందుచేత విప్లవాన్ని విజయవంతంగా నడపడానికి, ఒక రాజకీయపార్టీ, తన రాజకీయ పంథా నిర్దిష్టత్వం మీదా, తన నిర్మాణం పటిష్టతమీదా తప్పనిసరిగా ఆధారపడాలి.

గతితార్కిక ప్రాపంచిక దృక్పథం ప్రాచీనకాలంలోనే, చైనాలోను, యూరోపులోనూ ఆవిర్భవించింది. అయితే ప్రాచీన గతితర్కం, కొంతవరకు యాదృచ్ఛిక, అమాయక స్వభావాన్ని కలిగి వుండేది. ఆనాడుండిన సామాజిక చారిత్రిక పరిస్థితులలో అది అప్పటికింకా ఒక సిద్ధాంత శాఖను రూపొందించ లేకపోయింది. ఆ కారణంగా అది ప్రపంచాన్ని సమగ్రంగా వివరించలేక, అధిభౌతిక వాదంచే స్థానభ్రష్టత్వం పొందింది. 18, 19 శతాబ్దాల సంధి కాలంలో జీవించిన సుప్రసిద్ధ జర్మన్ తత్వవేత్త హెగెల్ గతితర్కానికి అతిముఖ్యమైన దోహదం చేశాడు. కానీ, ఆయన గతితర్కం, భావవాద పరమైనది. శ్రామికవర్గోద్యమ మహోపాధ్యాయులైన మార్క్సు, ఎంగెల్సులు మానవుని విజ్ఞాన చరిత్రలోని పాజిటివ్ జ్ఞానాంశాలను సమ్మిళితంచేసి (సింథసైజ్‌డు) మరీ ముఖ్యంగా, హెగెల్ యొక్క గతితర్కంలోని హేతుబద్ధ అంశాలను విమర్శనాత్మకంగా స్వీకరించి, మహత్తరమైన గతితార్కిక, చారిత్రిక భౌతికవాదాన్ని సృష్టించిన తర్వాతనే మానవ విజ్ఞాన చరిత్రలో ఒక అపూర్వ విప్లవం జరిగింది. లెనిన్ స్టాలిన్‌లు ఈ సిద్ధాంతాన్ని మరింతగా అభివృద్ధి చేశారు. అది చైనాకు వ్యాపించిన వెనువెంటనే, చైనా ఆలోచనా ప్రపంచంలో మహత్తరమైన మార్పులను తెచ్చిపెట్టింది.

ఈ గతితార్కిక ప్రాపంచిక దృక్పథం, విభిన్న వస్తువుల్లోని విరుద్ధాంశాలను ఎలా పరిశీలించి, వాటి గమనాన్ని విశ్లేషించాలో, అటువంటి విశ్లేషణ ప్రాతిపదిక మీద, వైరుధ్యాలను పరిష్కరించే పద్ధతులను ఎలా సూచించాలో మనకు బోధిస్తుంది.



అందుచేత, వస్తువులలోని వైరుధ్య సూత్రాన్ని, నిర్దిష్టమైన పద్ధతిలో అర్ధం చేసుకోవడం మనకు అత్యవసరం.

## 2. వైరుధ్యం యొక్క విశ్వజనీనత (universality)

వివరణ సౌలభ్యంకోసం నేను మొదట వైరుధ్యం యొక్క విశ్వజనీనత గురించిచెప్పి, అటుతర్వాత వైరుధ్యంయొక్క ప్రత్యేకత (particularity) గురించి చెబుతాను. కారణం ఏమంటే, వైరుధ్యంయొక్క విశ్వజనీనతను సంగ్రహంగా వివరించవచ్చు. ఎందుకనంటే భౌతిక-గతితార్కిక ప్రాపంచిక దృక్పథం కనిపెట్టబడి, మానవ చరిత్రలోని, ప్రకృతి చరిత్రలోని అనేక అంశాలను విశ్లేషించడానికి, విజయవంతంగా అన్వయించడానికి మార్క్సిజంకు మహాస్రష్టలైన మార్క్సు, ఎంగెల్సు, లెనిన్, స్టాలిన్‌లు సమాజంలోని, ప్రకృతిలోని అనేక అంశాలను (సోవియట్ యూనియన్‌లోలా) మార్చడానికి దానిని అన్వయించినవాదిగా అది బహుళ ప్రాచుర్యాన్ని పొందింది. కాగా, వైరుధ్యంయొక్క ప్రత్యేకత (particularity) చాలామంది కామ్రేడ్స్‌కు, ముఖ్యంగా పిడివాదులకు ఇప్పటికీ స్పష్టంగా అవగాహన కాలేదు. వైరుధ్యం యొక్క విశ్వజనీనత మీదనే, సరిగ్గా దానిమీదనే దాని ప్రత్యేకత ఆధారపడి వుందని వారికి అవగత మవలేదు. విప్లవ కార్యాచరణకు మార్గదర్శకత్వ మివ్వడానికి, మనకు ఎదురయ్యే నిర్దిష్ట విషయాలలోని వైరుధ్యం యొక్క ప్రత్యేకతను గురించి నొక్కిచెప్పి, దాన్ని సాంగోపాంగంగా వివరించడం అవసరం. ఈ కారణంచేత, వస్తువులలోని వైరుధ్యాల సూత్ర విశ్లేషణలో మొదట, వైరుధ్యంయొక్క విశ్వజనీనత గురించి విశ్లేషిద్దాం. తరువాత వైరుధ్యంయొక్క ప్రత్యేకత విశ్లేషణపై మరింత వక్కాణింపు నిచ్చి, చివరకు వైరుధ్యంయొక్క విశ్వజనీనతకు తిరిగివద్దాం.

వైరుధ్యంయొక్క విశ్వజనీనతకు, లేక నిత్యత్వానికి (absoluteness) రెండు రకాలైన అర్థంవుంది. ఒకటి అన్ని వస్తువుల అభివృద్ధి క్రమంలోనూ వైరుధ్యం వుంటుందన్నది. రెండవది, ప్రతి వస్తువు తాలూకు అభివృద్ధి క్రమంలోనూ మొదటినుంచి, చివరిదాకా, విరుద్ధాంశాల చలనం వుంటుందన్నది.

"చలనమే ఒక వైరుధ్యం" అని ఏంగెల్స్ అన్నారు.[5] లెనిన్ విరుద్ధాంశాల ఐక్యతా సూత్రాన్ని ఇలా వివరించారు. "ప్రకృతిలోని సమస్త దృగ్విషయాలలోనూ, ప్రక్రియలలోనూ (మేధస్సు, సమాజాలతో సహా) విరుద్ధమైన, పరస్పరం నిరాక

రించుకునే, (mutually exclusive) వ్యతిరేక ధోరణులను గుర్తించడం (కనుగొనడం)".[6] ఈ అభిప్రాయాలు సరియైనవేనా? అవును సరియైనవే. అన్ని వస్తువులలోనూ వుండే విరుద్ధాంశాల మధ్య అన్యోన్యాశ్రయము (ఒకదానిమీద మరొకటి ఆధారపడి వుండటము) అంశాలమధ్య ఘర్షణ, అన్ని వస్తువుల జీవికనూ నిర్దేశించి, వాటి అభివృద్ధిని ముందుకు తీసుకెడతాయి. వైరుధ్యంతో కూడనిది ఏదీ లేదు. వైరుధ్యం లేకుండా ఏదీ సంభవంకాదు.

చలనం తాలూకు అతిసాధారణ రూపాల (ఉదాహరణకు యాంత్రిక చలనాని)కి వైరుధ్యమే ప్రాతిపదిక. సంక్లిష్ట చలన రూపాలకు అది మరింత ఆధారభూత మవుతుంది.

ఏంగెల్స్ వైరుధ్యం యొక్క విశ్వజనీనతను ఇలా వివరించారు: "స్థల చలనంలాంటి సాధారణ యాంత్రిక చలనంలోనే వైరుధ్యం యిమిడి వున్నదంటే, పదార్థ చలనపు ఉన్నత రూపాల విషయంలోనూ, మరీ ముఖ్యంగా, సేంద్రియ ప్రాణుల (organic life) విషయంలోనూ, వాటి అభివృద్ధిలోనూ ఇది మరింత సత్యం.... ప్రాణం ఖచ్చితంగానూ, ప్రధానంగానూ ఎందులో వుందంటే, జీవి అనుక్షణమూ తానుగానూ, తద్భిన్నమైనదిగానూ వుండటంలో. అందుచేత జీవిక కూడా, విషయాలు, క్రమాల లోపల ఉండే వైరుధ్యమే, అది నిరంతరాయంగా ఉద్భవించి పరిష్కృత మవుతూ వుంటుంది. ఈ వైరుధ్యం నిలిచిపోగానే, జీవిక కూడా నిలిచిపోయి మరణం సంప్రాప్తమవుతుంది. భావనా ప్రపంచంలో కూడా మనం వైరుధ్యాలనుంచి తప్పించుకోలేమని అదేవిధంగా మనం గమనించాం. ఉదాహరణకు, మానవుడిలో అంతర్నిహితంగా వుండే అపరిమితమైన జ్ఞానగ్రహణా సామర్థ్యానికి, బాహిరంగా పరిమితమై వుండి, పరిమితమైన అభివ్యక్తిని కల్గివున్న మానవులలోనే అది వాస్తవంగా వుండటం అనే వాటి మధ్య వైరుధ్యం తన పరిష్కారాన్ని - మనకు ప్రత్యక్షానుభవంతో సంబంధమున్నంతవరకూ - అంతు లేకుండా సాగే తరాల పరంపరలో అనంతమైన పురోగతిలో కనుగొంటుంది....కొన్ని పరిస్థితుల్లో, సరళరేఖలు వక్రరేఖల మధ్య తేడాయే వుండదు అనే వైరుధ్యం ఉన్నత గణితశాస్త్ర మౌలిక సూత్రాల్లో ఒకటి....అయితే, సులభ గణితంలో కూడా కుప్పలు తెప్పలుగా వైరుధ్యాలున్నాయి.[7] లెనిన్ వైరుధ్యంయొక్క విశ్వజనీనతను ఇలా వివరించారు.

గణితంలో : +, −: డిఫరెన్షియల్, ఇంటిగ్రెల్



మెకానిక్స్‌లో : క్రియా, ప్రతిక్రియా

భౌతికశాస్త్రంలో : ధన, రుణ, విద్యుత్

రసాయనశాస్త్రంలో : అణువులు, సంయోగం, విచ్ఛిత్తి

సామాజికశాస్త్రంలో : వర్గపోరాటం[8]

యుద్ధంలో ఎదురుదాడి, ఆత్మరక్షణ, పురోగమనము, తిరోగమనం, గెలుపు, ఓటమి-అన్నీ కూడా పరస్పరం వైరుధ్యం గల అంశాలే. ఒకటి లేకుండా రెండోది వుండజాలదు. ఈ రెండు అంశాలమధ్య ఏకకాలంలోనే ఘర్షణ వుంటుంది, పరస్పరం ఆధారపడటమూ వుంటుంది. ఇది, మొత్తం యుద్ధానికి రూపంయిచ్చి దాని అభివృద్ధిని ముందుకు నడిపి, దాని సమస్యలను పరిష్కరిస్తుంది.

మానవుల భావనల్లోని తేడాలన్నిటిని, వాస్తవ వైరుధ్యాన్ని ప్రతిబింబింప చేసేవిగా భావించాలి. వస్తుగత వైరుధ్యాలు, స్వీయ మానసిక ఆలోచనల్లో ప్రతిబింబిస్తాయి. ఈ ప్రక్రియ, భావనల పరస్పర విరుద్ధ చలనానికి రూపంయిచ్చి భావాభివృద్ధిని ముందుకు తీసుకువెళ్ళి, మానవుని ఆలోచనల్లోని సమస్యలను నిరంతరాయంగా పరిష్కరిస్తుంది.

పార్టీ లోపల రకరకాల భిన్నాభిప్రాయాల మధ్య వ్యతిరేకతా, ఘర్షణా నిరంతరాయంగా జరుగుతుంటాయి. ఇవి పార్టీలో, వర్గాలమధ్య వైరుధ్యాల, సమాజంలో పాత కొత్తల మధ్య వైరుధ్యాల తాలూకు ప్రతిబింబమే. పార్టీలోపల వైరుధ్యాలు లేకపోతే, వాటిని పరిష్కరించుకోడానికి ఏ సిద్ధాంత పోరాటాలూ లేకపోతే పార్టీ జీవితం కడతేరుతుంది.

దీనినిబట్టి సాధారణ చలన రూపాల్లోనైతేనేం, సంక్లిష్ట చలన రూపాల్లో నైతేనేం, భౌతిక విషయాల్లోనైతేనేం, సిద్ధాంత విషయాల్లోనైతేనేం, వైరుధ్యాలు, విశ్వజనీనంగానూ, సమస్త ప్రక్రియల్లోనూ వుంటాయన్నది యిప్పటికే స్పష్టమైంది. అయితే, ప్రతి ప్రక్రియకు ఆరంభదశలో కూడా వైరుధ్యం వుంటుందా? ప్రతి ఒక్క వస్తువుయొక్క అభివృద్ధి ప్రక్రియలో ఆదినుంచి కొనదాకా విరుద్ధాంశాల చలనం వుంటుందా?

ప్రక్రియ ప్రారంభమైనపుడు వైరుధ్యం వుండదనీ, అది ఒకానొక దశకు అభివృద్ధి చెందిన తర్వాతనే వైరుధ్యం ఆవిర్భవిస్తుందనీ డిబోరిన్ సాంప్రదాయం భావిస్తున్నట్టుగా సోవియట్ తత్వవేత్తల వ్యాసాలనుండి మనకు తెలుస్తోంది. ఇదే

నిజమైతే ఆ దశకుముందు, ఆ ప్రక్రియ అభివృద్ధికి కారణం బాహిరంగానే వుంటుంది కానీ, అంతర్గతంగా కాదు. ఈ విధంగా డిబోరిన్ అధిభౌతిక వాదుల బాహిర కారణాల సిద్ధాంతానికీ, యాంత్రిక వాదానికీ తిరిగి పోయాడన్నమాట. ఈ నిర్దిష్ట సమస్యల విశ్లేషణలో, ఈ దృక్పథాన్ని అన్వయించి డిబోరిన్ సాంప్రదాయం, సోవియట్ యూనియన్‌లో నేటి పరిస్థితులలో కులక్కులకు, రైతాంగానికీ మధ్య సాధారణంగా వ్యత్యాసాలు చూసిందిగానీ, వైరుధ్యాలను చూడలేదు. ఆ విధంగా బుఖారిన్‌తో పూర్తిగా ఏకీభవిస్తోంది. ఫ్రెంచి విప్లవాన్ని విశ్లేషించడంలో, విప్లవానికి ముందు శ్రామికులు, రైతులు, బూర్జువాలతో కూడుకొని వున్న 'థర్డ్ ఎస్టేట్'లో అదే విధంగా వ్యత్యాసాలే తప్ప వైరుధ్యాలు లేవని అది భావిస్తోంది. డిబోరిన్ సాంప్రదాయపు ఈ అభిప్రాయాలు మార్క్సిస్టు వ్యతిరేకమైనవి. ప్రతి వ్యత్యాసంలోనూ వైరుధ్యం వుంటుందనీ, అసలు వ్యత్యాసమే వైరుధ్యమనీ ఈ సాంప్రదాయాలకు తెలీదు. శ్రామికులు, పెట్టుబడిదారులు అనే వర్గాలు ఏర్పడిన నాటినుండి, వాటి మధ్య వైరుధ్యమున్నది. కాకపోతే ఆరంభంలో అది అంత తీవ్రంగా లేదు. సోవియట్ యూనియన్‌లో వుండే సామాజిక పరిస్థితులలో కూడా, కార్మికులకు, రైతులకూ మధ్య వ్యత్యాసం వుంది. ఈ వ్యత్యాసం కూడా వైరుధ్యమే, అయితే శ్రమకు, పెట్టుబడికీ మధ్యగల వైరుధ్యంలాగా ఇది, వైషమ్యంగా మారేంతగా తీవ్రతరమవదు, లేదా, వర్గపోరాటరూపం తీసుకోదు. సోషలిస్టు నిర్మాణక్రమంలో, కార్మికులు, రైతులు దృఢ మైత్రీబంధాన్ని ఏర్పరచుకున్నారు. సోషలిజంనుండి కమ్యూనిజానికి పురోగమించే క్రమంలో ఈ వైరుధ్యాన్ని క్రమంగా పరిష్కరించుకుంటున్నారు. ఇది వివిధ రకాలైన వైరుధ్యాల సమస్యేగానీ, వైరుధ్యం వున్నదా, లేదా అన్న సమస్యకాదు. వైరుధ్యం విశ్వజనీనము, సత్యమూ అయినది, అన్ని వస్తువుల అభివృద్ధి ప్రక్రియల్లోనూ అది వుంది. ప్రతీ ప్రక్రియలోనూ ఆసాంతం ఆవరించి వుంటుంది.

ఒక కొత్త ప్రక్రియ ఆవిర్భవించింది అంటే దానర్థం ఏమిటి? పాత ఐక్యత, దానిలోని విరుద్ధాంశాలతో అంతమై, దాని స్థానంలోకి, ఒక కొత్త ఐక్యతా, దాని తాలూకు విరుద్ధాంశాలూ వస్తాయి. అపుడు పాత ప్రక్రియ స్థానంలో కొత్త ప్రక్రియ ఆవిర్భవిస్తుంది. పాత ప్రక్రియ సమాప్తమై కొత్తది ప్రారంభమవుతుంది. 'కొత్త ప్రక్రియలో కొత్త వైరుధ్యాలుంటాయి. ఆ వైరుధ్యాల అభివృద్ధి చరిత్ర ప్రారంభమవుతుంది.



లెనిన్ సూచించినట్టు, మార్క్స్ తన "పెట్టుబడి" అనే గ్రంథంలో వస్తువుల అభివృద్ధి ప్రక్రియలో ఆదినుంచి అంతందాకా నడిచే ఈ విరుద్ధాంశాల గమనానికి సంబంధించిన నమూనా విశ్లేషణ నొకదాన్ని ఇచ్చారు. ఏ వస్తువు అభివృద్ధిని అధ్యయనం చేయాలన్నా, తప్పనిసరిగా ఈ పద్ధతినే వినియోగించాలి. లెనిన్ కూడా ఈ పద్ధతిని నిర్దుష్టంగా వినియోగించారు. తన రచన లన్నింటిలోనూ దానికి అంటిపెట్టుకునే వున్నారు.

మార్క్స్ తన "పెట్టుబడి"లో బూర్జువా (సరుకుల) సమాజంలో, అతి మామూలైన, సర్వసాధారణమూ మౌలికమూ దైనికమూ అయిన సంబంధాన్నీ, అనేక కోట్లసార్లు ఎదురయ్యే సంబంధాన్ని, అంటే సరుకుల మారకం అనేదాన్ని మొదట విశ్లేషిస్తారు. ఈ అతిచిన్న విషయంలో (బూర్జువా సమాజంలోని ఈ "జీవకణం") విశ్లేషణ ఆధునిక సమాజంలోని అన్ని వైరుధ్యాల (లేదా అన్ని వైరుధ్యాల తాలూకు బీజాలు)ను బయటపెడుతుంది. అటు తర్వాతి వివరణ, ఈ వైరుధ్యాల అభివృద్ధి (పెరుగుదల మరియు చలనం, రెండూ కూడా), ఈ సమాజం తాలూకు వివిధ భాగాల సమిష్టి అభివృద్ధి మొదటినుంచి చివరిదాకా కనిపిస్తాయి" "గతితార్కిక వివరణ (లేదా అధ్యయనం) సాధారణంగా అదేవిధంగా వుండితీరాలి" అని కూడా లెనిన్ అన్నారు.[9]

చైనా కమ్యూనిస్టులు ఈ పద్ధతిని తప్పనిసరిగా నేర్చుకోవాలి. అప్పుడే వారు చరిత్రనూ, చైనా విప్లవపు ప్రస్తుత స్థితిని సరిగ్గా విశ్లేషించగలుగుతారు. దాని భవిష్యత్తును వూహించ గల్గుతారు.

## 3. వైరుధ్యం యొక్క ప్రత్యేకత

సమస్త వస్తువుల అభివృద్ధి ప్రక్రియల్లోనూ వైరుధ్యం వుంది. ప్రతి వస్తువు యొక్క అభివృద్ధి ప్రక్రియలోనూ ఆదినుంచి అంతందాకా అది నిబిడీకృతమై వుంటుంది. ఇంతదాకా మనం చర్చించిన వైరుధ్యం యొక్క విశ్వజనీనతా, నిత్యత్వమూ ఇదే. ఇపుడు మనం వైరుధ్యం యొక్క ప్రత్యేకతనూ, సాపేక్షతనూ (relativity) గురించి చర్చిద్దాం.

ఈ సమస్యను అనేక స్థాయిల్లో అధ్యయనం చేయాలి. ఒకటి, పదార్థం తాలూకు ప్రతిఒక్క చలన రూపంలోని వైరుధ్యానికి ఒక ప్రత్యేకత వుంటుంది. పదార్థానికి సంబంధించి మనిషికి కల్గిన జ్ఞానం, దాని చలన రూపాలకు సంబంధించిన

జ్ఞానమే. ఎందుకంటే, ప్రపంచంలో చలనంలో వున్న పదార్థం తప్ప మరేదీలేదు. ఈ చలనం తప్పనిసరిగా కొన్ని రూపాలను తీసుకోవాలి. పదార్థపు ప్రతీ చలన రూపాన్ని గురించీ పరిశీలించేటపుడు, చలనం తాలూకు ఇతర రూపాలతో గల సామ్యాలను తప్పనిసరిగా గమనించాలి. కానీ ప్రత్యేకించి ముఖ్యమూ అవసరమూ అయినదీ, ఒక వస్తువు గురించిన మన జ్ఞానానికి పునాది అయినదీ ఏమంటే ఈ పదార్థం తాలూకు ఈ చలన రూపానికి వున్న ప్రత్యేకతను గుర్తించడం. అంటే ఈ చలన రూపానికి ఇతర రూపాలకు మధ్యవున్న గుణాత్మక తేడాను గమనించడం. మనం అలా చేసినపుడే మనకు వస్తువుల మధ్య తేడా తెలుస్తుంది. ప్రతి చలన రూపంలోనూ దాని ప్రత్యేక వైరుధ్యం యిమిడి వుంటుంది. వస్తువుల మధ్య తేడాను నిర్ణయించే ప్రత్యేకసారం ఈ వైరుధ్యంలో వుంటుంది. అదే అంతర్గత కారణం లేదా దాన్ని, ప్రపంచంలోని అపరిమిత వైవిధ్యం గల వస్తువులకు ప్రాతిపదిక అని చెప్పవచ్చు. ప్రకృతిలో యాంత్రిక చలనం, ధ్వనీ, కాంతి, ఉష్ణం, విద్యుత్తు, విచ్ఛిత్తి, సంయోగం మొదలైన అనేక చలన రూపాలున్నాయి. ఈ రూపాలన్నీ ఒకదానిమీద ఒకటి ఆధారపడి వుండేవే. అయితే, సారంలో దేనికది భిన్నంగానే వుంటుంది. ప్రతి చలన రూపం తాలూకు ప్రత్యేకసారాన్ని దాని ప్రత్యేక వైరుధ్యమే నిర్ణయిస్తుంది. ఈ సత్యం ప్రకృతికే గాక, సామాజిక, సిద్ధాంత విషయాలకు కూడా వర్తిస్తుంది. ప్రతి సమాజ రూపానికీ, ప్రతి సిద్ధాంత రూపానికీ, దాని ప్రత్యేక వైరుధ్యమూ, ప్రత్యేక సారమూ వుంటాయి.

వివిధ విజ్ఞాన శాస్త్రాలకు మధ్యగల తేడాలను, వాటి అధ్యయన విషయాలలో నిబిడీకృతంగా వుండే ప్రత్యేక వైరుధ్యాల ప్రాతిపదిక మీదనే, వేరుచేసి చూస్తాం. ఒక రంగానికి చెందిన దృగ్విషయాలనూ, ప్రత్యేకమైన వైరుధ్యాలనూ అధ్యయనం చేయడానికి ఒక విజ్ఞానశాస్త్రశాఖ ప్రత్యేకంగా వుంటుంది. ఉదాహరణకు, గణితంలో ధన ధన రుణ సంఖ్యలు; మెకానిక్స్‌లో క్రియ ప్రక్రియలు; భౌతిక శాస్త్రంలో ధన రుణ విద్యుత్తులు; రసాయనశాస్త్రంలో విచ్ఛిత్తి సంయోగాలు; సామాజిక శాస్త్రాలలో ఉత్పత్తి శక్తులు ఉత్పత్తి సంబంధాలు, వర్గాలు వర్గపోరాటాలు; సైనిక శాస్త్రంలో ఎదురుదాడి ఆత్మరక్షణ; తత్వశాస్త్రంలో భావవాదం భౌతికవాదం, అధిభౌతిక దృక్పథం, గతితార్కిక దృక్పథం వగైరా వగైరా—ఇవన్నీ వేరువేరు విజ్ఞాన శాస్త్ర శాఖల అధ్యయన లక్ష్యాలు అవడానికి కారణం ఏమంటే, ప్రతి శాఖకు దాని ప్రత్యేక వైరుధ్యం వుండటమూ, ప్రత్యేకసారం వుండటమూనూ. అయితే,



వైరుధ్యం యొక్క విశ్వజనీనతను మనం అర్థంచేసుకుంటే తప్ప, వస్తువుల చలనం లేదా అభివృద్ధికి విశ్వజనీన కారణాన్ని గానీ, విశ్వజనీన ప్రాతిపదికనుగానీ మనం కనిపెట్టలేం. అయితే, వైరుధ్య ప్రత్యేకతను అధ్యయనం చేస్తేనేకాని, ఒక వస్తువును ఇతర వస్తువుల నుంచి ప్రత్యేకించే, విశిష్ట సారాన్ని నిర్ణయించే మార్గం లేదు; ఒక వస్తువు యొక్క చలనానికీ లేదా అభివృద్ధికీ గల ప్రత్యేక కారణాన్ని లేక ప్రాతిపదికను కనిపెట్టే మార్గం లేదు; ఒక వస్తువును యితర వస్తువుల నుంచి వేరుగా తెలుసుకోడానికిగానీ, విజ్ఞాన శాస్త్రశాఖల పరిధులను నిర్ణయించడానికి గానీ మార్గం లేదు.

మానవుని జ్ఞానం చలనక్రమం మాటకు వస్తే, విడివిడి వస్తువుల, ప్రత్యేక వస్తువుల జ్ఞానం నుంచి, సాధారణంగా వస్తువుల గురించిన జ్ఞానం దాకా ఎల్లప్పుడూ క్రమక్రమంగానే పెరుగుతుంది. అనేక విడివిడి వస్తువుల ప్రత్యేకసారం తెలుసుకున్న తర్వాతనే మనిషి సార్వత్రీకరణకు (generalisation) పోయి వస్తువులలోని సామాన్య (comman) సారాన్ని తెలుసుకోగల్గుతాడు. మనిషి ఈ సామాన్య సారాన్ని గ్రహించిన తర్వాత, దాని మార్గదర్శకత్వంలో, ఇంతకు పూర్వం అధ్యయనం చేయని, లేదా కూలంకషంగా అధ్యయనం చేయని వివిధ నిర్దిష్ట వస్తువులను అధ్యయనం చేయడానికి, వాటి ప్రత్యేక సారాన్ని తెలుసుకోడానికి పూనుకుంటాడు. ఇలా చేయడం ద్వారానే అతడు వాటిలోని సామాన్య సారానికి సంబంధించిన తన జ్ఞానాన్ని పరిపుష్టం చేసుకొని, సుసంపన్నం చేసుకొని, అభివృద్ధి చేసుకోగలడు. అటువంటి జ్ఞానం, చివికిపోకుండా, లేదా శిలీభూతమవకుండా నిరోధించుకోగలడు. అభివ్యక్తి (కాగ్నిషన్) తాలూకు రెండు క్రమాలు ఇవి: ఒకటి, ప్రత్యేకమైన దాని నుండి సాధారణానికి; రెండవది, సాధారణం నుండి ప్రత్యేకానికి. ఈ విధంగా అభివ్యక్తి ఎల్లప్పుడూ వలయాలుగానే (cycles) పురోగమిస్తుంది. (శాస్త్రీయ పద్ధతికి ఖచ్చితంగా అంటిపెట్టుకుని ఉన్నపుడు) ప్రతివలయం మానవ జ్ఞానాన్ని ఒకొక్క మెట్టు పైకి తీసుకుపోయి, మరింత పరిపుష్టం చేస్తుంది. ఈ విషయంలో మన పిడివాదులు పొరబడేది ఎక్కడంటే, ఒకవంక, వారు, మనం, వైరుధ్యపు ప్రత్యేకతను అధ్యయనంచేసి, విడివిడి వస్తువుల ప్రత్యేక సారాన్ని తెలుసుకుంటేగాని వైరుధ్యం యొక్క విశ్వజనీనతను గురించి, వస్తువులలో ఉండే సామాన్య సారాన్ని గురించి తెలుసుకోజాలమని తెలుసుకోరు. మరోవంక, వస్తువుల సామాన్య సారాన్ని గురించి తెలుసుకున్న తర్వాత, మనం తప్పనిసరిగా మరింత

లోతులోకి వెళ్ళి, ఇంకా కూలంకషంగా అధ్యయనంచేయని నిర్దిష్ట వస్తువులను లేదా ఇపుడిపుడే ఆవిర్భవించిన వాటిని అధ్యయనం చేయాలని వారు గ్రహించరు. మన పిడివాదులు సోమరిపోతులు. వారు నిర్దిష్ట విషయాలను కష్టపడి అధ్యయనం చేయరు. సాధారణ సత్యాలను శూన్యం నుండి ఊడిపడినవిగా భావించి వాటిని అర్థంగాని, అయోమయ సూత్రాలుగా మార్చి తద్వారా మనిషి సత్యాన్ని తెలుసుకునే క్రమం పూర్తిగా నిరాకరించి అస్తవ్యస్తం చేస్తారు. అభివ్యక్తిలోని రెండు ప్రక్రియలు-ప్రత్యేకం నుండి సాధారణానికి; సాధారణం నుండి ప్రత్యేకానికి - మధ్య ఉండే అంతస్సంబంధాన్ని కూడా వారు అర్థం చేసుకోరు. వారు మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతాన్ని కొంచెం కూడా అర్థంచేసుకోరు.

ప్రత్యేక వైరుధ్యాన్ని తద్వారా నిర్ణీతమైన ప్రతిఒక్క పదార్థ చలనరూపాల బృహత్తర వ్యవస్థ సారాన్ని అధ్యయనం చేయడమొక్కటే గాక, ప్రత్యేక వైరుధ్యాన్ని, పదార్థ చలనపు ప్రతి రూపపు, సుదీర్ఘ అభివృద్ధి క్రమంలోని ప్రతి ప్రక్రియ యొక్క, సారాన్ని కూడా అధ్యయనం చేయడం అవసరం. ప్రతి చలన రూపంలోనూ, వాస్తవమైన (ఊహాజనితమైనది కాని) ప్రతి అభివృద్ధి ప్రక్రియ, గుణాత్మకంగా భిన్నంగా వుంటుంది. మన అధ్యయనం తప్పనిసరిగా, ఈ అంశానికి ప్రాముఖ్యతనిచ్చి, దీనినుండే ప్రారంభమవాలి.

గుణాత్మకంగా భిన్నమైన వైరుధ్యాలు, గుణాత్మకంగా భిన్నమైన పద్ధతుల ద్వారానే పరిష్కారమవుతాయి. ఉదాహరణకు, శ్రామికవర్గానికి, బూర్జువా వర్గానికి మధ్యనున్న వైరుధ్యం సోషలిస్టు విప్లవ పద్ధతి ద్వారా పరిష్కృతమవుతుంది. అశేష జనబాహుళ్యానికి, భూస్వామ్య వ్యవస్థకు మధ్యవుండే వైరుధ్యం ప్రజాస్వామిక విప్లవ పద్ధతి ద్వారా పరిష్కృత మవుతుంది. వలసలకు, సామ్రాజ్యవాదానికి మధ్య నుండే వైరుధ్యం జాతీయ విప్లవ యుద్ధంద్వారా పరిష్కృత మవుతుంది. సోషలిస్టు సమాజంలో, కార్మికవర్గానికీ, రైతాంగ వర్గానికీ మధ్యన వైరుధ్యం, వ్యవసాయంలో సమిష్టికరణ (collectivisation) యాంత్రికీకరణల పద్ధతి ద్వారా పరిష్కృత మవుతుంది. కమ్యూనిస్టు పార్టీలోపల ఉండే వైరుధ్యం, విమర్శ ఆత్మవిమర్శ పద్ధతి ద్వారా పరిష్కృత మవుతుంది. సమాజానికీ, ప్రకృతికీ మధ్యవుండే వైరుధ్యం ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడం అనే పద్ధతి ద్వారా పరిష్కృతమవుతుంది. ప్రక్రియలు మారతాయి. పాత ప్రక్రియలు, పాత వైరుధ్యాలు అదృశ్యమవుతాయి, కొత్తప్రక్రియలు, కొత్త వైరుధ్యాలు బైటపడతాయి. వైరుధ్యాలను పరిష్కరించే



పద్ధతులు కూడా తదనుగుణంగానే మారతాయి. రష్యాలో, ఫిబ్రవరి విప్లవం పరిష్కరించిన వైరుధ్యానికీ, అక్టోబరు విప్లవం పరిష్కరించిన వైరుధ్యానికీ మధ్యా, వాటిని పరిష్కరించడానికి ఉపయోగించిన పద్ధతులమధ్యా కూడా మౌలికమైన తేడా వుండింది. వేరువేరు వైరుధ్యాలను పరిష్కరించడానికి వేరువేరు పద్ధతులను వాడడం అనే సూత్రం, మార్క్సిస్టు-లెనినిస్టులు ఖచ్చితంగా పాటించి తీరవల్సినది. పిడివాదులు ఈ సూత్రాన్ని పాటించరు. వేరువేరు రకాల విప్లవాలలో పరిస్థితులు వేరువేరుగా వుంటాయని వారు గ్రహించరు కాబట్టి, వేరువేరు వైరుధ్యాలను పరిష్కరించడానికి వేరువేరు పద్ధతులను వాడాలని వారు అర్థం చేసుకోరు. అందుకు మారుగా వారు అనివార్యంగా తమ తిరుగులేదనుకునే సూత్రాన్ని చేపట్టి దాన్ని ఏకపక్షంగా సర్వత్రా గుడ్డిగా ప్రయోగిస్తారు. దానివల్ల విప్లవానికి ఎదురు దెబ్బలు తగులుతాయి. లేదా మొదట సక్రమంగా సాగినదంతా అస్తవ్యస్తమవుతుంది.

ఒక వస్తువు అభివృద్ధికి సంబంధించిన ఏ ప్రక్రియలలోనైనా ఉండే వైరుధ్యాల ప్రత్యేకతను, ఏకమొత్తంగా గానీ లేదా వాటి అంతస్సంబంధాలలోగానీ వ్యక్తం చేయాలంటే, అంటే, ఆ ప్రక్రియ సారాన్ని వ్యక్తం చేయడానికి, ఆ ప్రక్రియలోని వైరుధ్యాల, ప్రతిదానికి చెందిన రెండు అంశాల ప్రత్యేకతను వ్యక్తం చేయడం అవసరం. లేకపోతే ఆ ప్రక్రియ సారాన్ని కనిపెట్టడం అసాధ్యమవుతుంది. ఈ విషయంలో కూడా మన అధ్యయనంలో మనం అత్యంత శ్రద్ధ చూపాలి.

ఏ గురుతర విషయానికి సంబంధించిన అభివృద్ధి క్రమంలోనైనా అనేక వైరుధ్యాలుంటాయి. ఉదాహరణకు, అతి సంక్లిష్టమైన పరిస్థితులు వున్న, చైనా బూర్జువా ప్రజాస్వామిక విప్లవ క్రమంలో, చైనా సమాజంలోని అన్ని పీడిత వర్గాలకూ సామ్రాజ్యవాదానికీ మధ్యవుండే వైరుధ్యమూ, అశేష ప్రజా బాహుళ్యానికీ భూస్వామ్య విధానానికి మధ్యవుండే వైరుధ్యమూ, కార్మిక వర్గానికీ బూర్జువా వర్గానికీ మధ్యవుండే వైరుధ్యమూ, రైతాంగానికి నగర పెటీబూర్జువాజీతోనూ బూర్జువా వర్గంతోను వున్న వైరుధ్యం, వివిధ అభివృద్ధి నిరోధక పాలక బృందాలమధ్య వైరుధ్యము మొదలైన వైరుధ్యాలు వున్నాయి. ఈ వైరుధ్యాల నన్నిటినీ ఒకే రీతిగా పరిగణించడానికి వీలులేదు. దేని ప్రత్యేకత దానికుంది. అంతేకాదు ప్రతి వైరుధ్యం తాలూకు రెండు అంశాలతోనూ ఒకే రీతిగా వ్యవహరించ వీలులేదు. ఈ అంశాలకు, దేని లక్షణాలు దానికున్నాయి. చైనా విప్లవంలో నిమగ్నులమై వున్న మనం, ఈ వైరుధ్యాల ప్రత్యేకతను ఏకమొత్తంగా అంటే వాటి అంతస్సంబంధాలను అర్థం

చేసుకోవాలి. అంతేగాక మొత్తంగా అర్థం చేసుకోడానికి ప్రతి వైరుధ్యం తాలూకు రెండు అంశాలను కూడా అధ్యయనం చేయాలి. అందుకు అదే ఏకైకమార్గం. ఒక వైరుధ్యం తాలూకు ప్రతీ అంశాన్నీ అర్థం చేసుకోవడమంటే, ప్రతి అంశమూ ఏ నిర్దిష్ట స్థానాన్ని ఆక్రమిస్తోందో దాని వ్యతిరేకాంశంతో పరస్పరం ఆధారపడడంలో, దానితో వైరుధ్యం కల్గివుండడంలోనూ అది ఏ నిర్దిష్ట రూపాన్ని ధరిస్తుందో, అవి రెండూ పరస్పరం ఒకదానిమీద ఇంకొకటి ఆధారపడి వుండి, వైరుధ్యంలో కూడా వున్నప్పుడు, అంతేగాక ఒకదానిమీద ఇంకొకటి ఆధారపడటం ఉడిగిపోయిన తర్వాత, దాని వ్యతిరేకాంశంతో ఘర్షణలో ఏ నిర్దిష్ట పద్ధతులు వినియోగించబడ్డాయో అన్న వాటిని అర్థం చేసుకోడమే. ఈ సమస్యల అధ్యయనం చాలా అవసరం. మార్క్సిజంలో అతిముఖ్యమైనదీ, మార్క్సిజం జీవనాడీ, నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించడమేనని లెనిన్ చెప్పిన దానికి అర్థమిదే.[10] మన పిడివాదులు లెనిన్ బోధనలను ఉల్లంఘించారు. వారు ఎన్నడూ తమ బుర్రల నుపయోగించి దేనినీ నిర్దిష్టంగా విశ్లేషించరు. తమ రచనలలోనూ ఉపన్యాసాలలోనూ వారు ఎప్పుడూ సారరహితమైన పడికట్టు పదజాలాన్ని ఉపయోగించి, పార్టీలో చాలా చెడ్డ పనిశైలిని సృష్టిస్తారు.

ఒక సమస్యను అధ్యయనం చేసేటపుడు, మనం స్వీయ మానసిక తత్వాన్ని, ఏకపక్షతనూ, అల్పదృష్టినీ విడనాడాలి. స్వీయ మానసిక ధోరణి అంటే, సమస్యలను వాస్తవ దృష్టితో చూడకపోవడం, అంటే సమస్యలను వీక్షించడంలో భౌతికవాద దృక్పథాన్ని వినియోగించకపోవడం. 'ఆచరణ' అనే నా వ్యాసంలో నేను దీన్ని గురించి చర్చించాను. ఏకపక్షంగా వుండడం అంటే, సమస్యలను అన్ని కోణాల నుంచి చూడకపోవడం. ఉదాహరణకు, చైనాను మాత్రమే అర్థం చేసుకొని జపానును అర్థం చేసుకోకపోవడం, కమ్యూనిస్టు పార్టీనే అర్థం చేసుకొని కొమింటాంగ్‌ను అర్థం చేసుకోకపోవడం, శ్రామిక వర్గాన్ని మాత్రమే అర్థం చేసుకొని బూర్జువా వర్గాన్ని అర్థం చేసుకోకపోవడం, రైతాంగాన్ని మాత్రమే అర్థం చేసుకొని భూస్వాముల నర్థం చేసుకోకపోవడం, అనుకూల పరిస్థితులను మాత్రమే అర్థం చేసుకొని గడ్డు పరిస్థితుల నర్థం చేసుకోకపోవడం, గతాన్ని మాత్రమే అర్థం చేసుకొని భవిష్యత్తును అర్థం చేసుకోకపోవడం, విడివిడి భాగాలను మాత్రమే అర్థం చేసుకొని మొత్తాన్ని అర్థం చేసుకోకపోవడం, లోపాలను మాత్రమే అర్థం చేసుకొని విజయాలను అర్థం చేసుకోకపోవడం, వాది కేసును మాత్రమే అర్థం చేసు



కొని ప్రతివాది కేసును అర్థం చేసుకోకపోవడం, రహస్య విప్లవ కృషిని మాత్రమే అర్థం చేసుకొని బహిరంగ విప్లవ కృషిని అర్థం చేసుకోకపోవడం - మొదలైనవి. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఒక వైరుధ్యం తాలూకు ఉభయాంశాల లక్షణాలను అర్థం చేసుకోకపోవడం అన్నమాట. సమస్యను ఏకపక్ష దృష్టితో చూడటమంటే యిదే. లేదా దాన్ని ఒక భాగాన్ని మాత్రమే చూసి మొత్తాన్ని చూడకపోవడం, చెట్లను మాత్రమే చూసి అడివిని చూడకపోవడం అని అనవచ్చు. అలాచేస్తే, వైరుధ్యాల పరిష్కారానికి పద్ధతిని కనుగొనడం సాధ్యంకాదు, విప్లవ కర్తవ్యాలను సాధించడం సాధ్యంకాదు. బాధ్యతలను చక్కగా నిర్వహించడంగానీ, పార్టీ అంతరంగిక సైద్ధాంతిక పోరాటాన్ని సరిగ్గా అభివృద్ధి చేయడం గానీ సాధ్యంకాదు. "నీ శత్రువుని తెలుసుకుని, నిన్ను నీవు తెలుసుకుంటే అపజయభయం లేకుండా నీవు నూరు యుద్ధాలు చేయగలవు"[11] అని సున్‌వుజు సైనిక శాస్త్రాన్ని గురించి చర్చిస్తూ అన్నాడంటే, అతడు యుద్ధంలోని రెండు పక్షాల గురించి ప్రస్తావిస్తున్నాడన్నమాట. టాంగ్ రాజవంశకాలంనాటి వీచెంగ్[12] కూడా ఏకపక్షత తాలూకు తప్పును గ్రహించే "ఇరుపక్షాల మాటలు విను, నీకు వికాసం కల్గుతుంది, ఒక పక్షం మాటే విన్నావో అంధకారమే" అన్నాడు. కానీ మన కామ్రేడ్స్ తరచుగా సమస్యలను ఏకపక్ష దృష్టితో చూస్తారు. చిక్కులలో పడతారు. "షుయి హు చువాన్" అనే నవలలో, సుంగ్‌చియాంగ్, 'చు' గ్రామంమీద మూడుసార్లు దాడిచేస్తాడు.[13] అతడికి స్థానిక పరిస్థితులు తెలియక, తప్పుడు పద్ధతులు వినియోగించినందువల్ల రెండుసార్లు ఓడిపోతాడు. ఆ తర్వాత అతడు పద్ధతి మార్చుకుంటాడు. అతడు మొదట పరిస్థితిని గురించి శోధించాడు, బాటల జిగిబిగిని అర్థంచేసుకున్నాడు. 'లి', 'హు', 'చు' అనే గ్రామాల మధ్య ఐక్యతను భగ్నంచేస్తాడు. విదేశీ గాథల్లోని 'ట్రోజన్‌హార్సు'లో వినియోగించిన ఎత్తులాంటి ఎత్తును వినియోగిస్తూ, తన మనుషులను మారువేషంలో శత్రుశిబిరంలోకి పంపించి మాటుకాయిస్తాడు. మూడవసారి అతడు జయిస్తాడు. "షుయిహుచువాన్"లో భౌతిక గతితర్కానికి చెందిన ఉదాహరణలెన్నో వున్నాయి. వాటిలో 'చు' గ్రామంమీద మూడు దాడుల కథ అత్యుత్తమమైన వాటికోవకి చెందినది. లెనిన్ ఇలా అన్నారు:

"…. మనం ఒక వస్తువును గురించి వాస్తవంగా తెలుసుకోవాలంటే, మనం తప్పనిసరిగా దాన్ని సమాశ్లేషించి, దాని అన్ని పార్శ్వాలను, అన్ని సంబంధాలను అన్ని "సంధానాలను" (mediations) అధ్యయనం చేయాలి. దాన్ని మనం

ఎన్నడూ సంపూర్ణంగా సాధించలేము, కానీ, సర్వతోముఖ అధ్యయనం కోసం ప్రయత్నించడం ద్వారా తప్పులకు, సంకుచితత్వాని (rigidity) కీ తావు లేకుండా జాగ్రత్త పడచ్చు".[14]

ఆయన మాటల్ని మనం గుర్తుంచుకోవాలి. అల్పదృష్టితో వుండం అంటే, ఒక వైరుధ్యం యొక్క లక్షణాలను ఏకమొత్తంగా చూడకపోవడమూ దాని ఉభయాంశాలలో ప్రతివాని లక్షణాలను చూడకపోవడం, ఒక విషయాన్ని లోతుగా మదించి, దాని వైరుధ్యం తాలూకు లక్షణాలను సునిశితంగా పరిశీలించవలసిన అవసరాన్ని త్రోసిపుచ్చుతూ కేవలం దూరం నుంచి దాని స్థూల స్వరూపాన్ని చూసి ఆ వైరుధ్యాన్ని పరిష్కరించడానికి ప్రయత్నించడం (ఒక ప్రశ్నకు సమాధానం చెప్పడం, ఒక తగాదాను పరిష్కరించడం, పనిని నిర్వహించడం, లేదా సైనిక చర్యను నిర్దేశించడం) అన్నమాట. ఇలా చెయ్యడం చిక్కులకు దారితీస్తుంది. చైనాలోని పిడివాద, అనుభవవాద (empiricist) కామ్రేడులు పొరపాట్లు చెయ్యడానికి కారణం, వారు విషయాలను స్వీయమానసిక, ఏకపక్ష, అల్పదృష్టితో చూసే పద్ధతిలోనే వుంది. ఏకపక్ష దృష్టి, అల్పదృష్టిలతో వుండటం అంటే, అదే సమయంలో స్వీయ మానసిక తత్వంతో కూడా ఉండడమే. ఎందుకంటే వాస్తవ వస్తువులన్నీ వాస్తవానికి పరస్పరం సంబంధం కల్గివుంటాయి, అంతర్గత నియమాలకు బద్ధమై వుంటాయి. కానీ, వస్తువులను ఉన్నవి ఉన్నట్టుగానే ప్రతిబింబించే కర్తవ్యాన్ని చేపట్టేబదులు కొందరు వస్తువులను ఏకపక్ష దృష్టితో గానీ లేదా అల్పదృష్టితో గానీ చూస్తారు. వాటి పరస్పర సంబంధాల గురించిగానీ, వాటి అంతర్గత నియమాల గురించిగానీ వారికి తెలియదు. అందుచేత వారి పద్ధతి స్వీయ మానసిక తత్వమయమైనది.

ఒక వస్తువు అభివృద్ధిలో విరుద్ధాంశాల చలనం తాలూకు ప్రక్రియ మొత్తం, ఆ అంశాల పరస్పర సంబంధాలలోనూ, ప్రతీఒక్క అంశంలోనూ, ప్రత్యేక లక్షణాలను కల్గివుంటుంది. వాటిని గురించి మనం తప్పక శ్రద్ధపెట్టాలి. అయితే, ప్రక్రియలోని ప్రతి దశకు, దాని విశిష్ట లక్షణాలు వుంటాయి. వాటిని గురించి కూడా మనం శ్రద్ధవహించాలి.

ఒక వస్తువు అభివృద్ధి ప్రక్రియలోని మౌలిక వైరుధ్యమూ, ఈ వైరుధ్యంద్వారా నిర్ణీతమయ్యే ఆ ప్రక్రియ సారమూ, ఈ ప్రక్రియ పరిపూర్తి అయ్యేదాకా అంతరించవు. ఐతే ఒక సుదీర్ఘ ప్రక్రియలో, సాధారణంగా పరిస్థితులు ప్రతీ దశలోనూ మారతాయి.



ఎందుచేతనంటే ఒక వస్తువు అభివృద్ధి ప్రక్రియలోని మౌలిక వైరుధ్య స్వభావమూ, ఆ ప్రక్రియ సారమూ మార్పు చెందనప్పటికీ, ఆ సుదీర్ఘ ప్రక్రియలో మౌలిక వైరుధ్యం, ఒక దశనుండి మరోదశకు చేరుకొనే కొద్దీ, మరింత తీవ్రతరమౌతుంది. ఇంతేగాక మౌలిక వైరుధ్యం వల్ల నిర్ణయించబడే, లేదా ప్రభావితమయ్యే అసంఖ్యాకమైన చిన్న, పెద్ద వైరుధ్యాలలో కొన్ని తీవ్రతరమవుతాయి. కొన్ని తాత్కాలికంగా గాని, పాక్షికంగా గాని పరిష్కృత మవుతాయి, లేదా ఉపశమిస్తాయి, కొన్ని కొత్త వైరుధ్యాలు ఆవిర్భవిస్తాయి. అందుచేత ప్రక్రియలో దశలుంటాయి. ఒక వస్తువు అభివృద్ధి ప్రక్రియలోని దశలపట్ల శ్రద్ధ పెట్టనివారు వైరుధ్యాలతో సరైన తీరులో వ్యవహరించలేరు.

ఉదాహరణకు, యథేచ్ఛగా పోటీపడిన శకంలోని పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా అభివృద్ధి చెందినపుడు మౌలిక వైరుధ్యంలోని రెండు వర్గాలైన కార్మికవర్గం, బూర్జువా వర్గాల వర్గ స్వభావంలోగానీ, సమాజం తాలూకు పెట్టుబడిదారీ సారంలోగానీ మార్పులేదు. ఈ రెండు వర్గాలమధ్య వైరుధ్యం మరింత తీవ్రతరమైంది, గుత్త పెట్టుబడికి, గుత్తపెట్టుబడేతర పెట్టుబడికి మధ్య వైరుధ్యం పుట్టుకొచ్చింది. వలసలకు, వలసవాద దేశాలకూ మధ్య వైరుధ్యం తీవ్రతరమైంది. పెట్టుబడిదారీ దేశాల మధ్యనున్న అసమానాభివృద్ధి కారణంగా ఏర్పడిన ఈ వైరుధ్యం, చాలా సునిశితంగా వ్యక్తమయింది. ఈ విధంగా పెట్టుబడిదారీ విధానం తాలూకు ఒక ప్రత్యేకదశ, సామ్రాజ్యవాదదశ, పుట్టుకొచ్చింది. లెనిన్, స్టాలిన్‌లు ఈ వైరుధ్యాలను సరిగా వివరించి వాటి పరిష్కారానికి శ్రామికవర్గ విప్లవ సిద్ధాంతాన్ని, ఎత్తుగడలను రూపొందించారు. కాబట్టి, సరిగ్గా అందుకే, లెనినిజం సామ్రాజ్యవాద శ్రామిక వర్గ విప్లవాల శకానికి చెందిన మార్క్సిజం అయింది.

1911 విప్లవంతో ప్రారంభమైన చైనా బూర్జువా ప్రజాస్వామిక విప్లవ క్రమాన్ని చూడండి: దానికి కూడ అనేక విస్పష్ట దశలున్నాయి. ప్రత్యేకించి విప్లవం బూర్జువా వర్గ నాయకత్వంకింద వున్న కాలమూ, శ్రామిక వర్గ నాయకత్వం కింద వున్న కాలమూ, ఈ రెండూ చాలా వ్యత్యాసం వున్న చారిత్రిక దశలు మరో విధంగా చెప్పాలంటే శ్రామికవర్గ నాయకత్వం, విప్లవ స్వరూపాన్ని ఆసాంతంగా, మౌలికంగా మార్చివేసింది, వర్గాలకు సంబంధించిన కొత్త పొందికను ఏర్పరచింది. రైతాంగ విప్లవంలో ఒక వెల్లువను ఆవిష్కరించింది. సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానాలకు వ్యతిరేక విప్లవానికి పరిపుష్టిని చేకూర్చింది. ప్రజాస్వామిక విప్లవం,

సోషలిస్టు విప్లవంగా పరివర్తన చెందే అవకాశాన్ని సృష్టించింది - ఇలా యింకెన్నిటినో చేసింది. విప్లవం బూర్జువా నాయకత్వం కిందవున్న కాలంలో వాటిలో ఏదీ సాధ్యమవలేదు. ఆ యావత్తు ప్రక్రియలోని మౌలిక వైరుధ్యపు స్వభావంలో అంటే, ఆ ప్రక్రియ తాలూకు సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, ప్రజాస్వామిక విప్లవ స్వభావంలో (అర్ధవలస, అర్ధ భూస్వామ్య స్వభావం దీనికి విరుద్ధమైనది) ఏ మార్పు జరగనప్పటికీ, ఈ ప్రక్రియ, ఇరవై ఏళ్ళకు పైగా సాగిన క్రమంలో అనేక అభివృద్ధి దశలను దాటింది. ఈ కాలంలో అనేక మహత్తర ఘటనలు జరిగాయి - 1911 విప్లవ వైఫల్యము, ఉత్తరాది యుద్ధ ప్రభువుల పాలన ఏర్పడడమూ, మొట్టమొదటి జాతీయ ఐక్యసంఘటన ఏర్పాటు, 1924-27 విప్లవం, ఐక్యసంఘటన విచ్ఛిత్తి, బూర్జువావర్గం ప్రతీఘాత విప్లవ పక్షంలో చేరడమూ, కొత్త యుద్ధప్రభువుల మధ్య యుద్ధాలు, వ్యవసాయ విప్లవయుద్ధం, రెండవ జాతీయ ఐక్యసంఘటన ఏర్పాటు, జపాను వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధం, ఈ దశలన్నిటికీ, కొన్ని వైరుధ్యాలు తీవ్రతరమవడం (ఉదాహరణకు: వ్యవసాయ విప్లవ యుద్ధం, నాలుగు ఈశాన్య రాష్ట్రాలపై జపాను దండయాత్ర), కొన్ని యితర వైరుధ్యాలు తాత్కాలికంగా గాని,పాక్షికంగా గాని పరిష్కృతమవడం (ఉదాహరణకు: ఉత్తరాది యుద్ధప్రభువులు నాశనమవడం, భూస్వాముల భూముల్ని మనం స్వాధీనం చేసుకోడం), మరికొన్ని వైరుధ్యాలు పుట్టుకురావడం (ఉదాహరణకు: కొత్త యుద్ధ ప్రభువులమధ్య ఘర్షణలు, దక్షిణాదిలో మన విప్లవ స్థావర ప్రాంతాలు పోయిన అనంతరం భూస్వాములు భూములను తిరిగి లాక్కోడం) - వంటి ప్రత్యేక లక్షణాలున్నాయి.

ఒక వస్తువు అభివృద్ధి ప్రక్రియలోని ప్రతిదశవద్ద వుండే వైరుధ్యాల ప్రత్యేకతలను అధ్యయనం చేసేటపుడు, మనం వాటిని, వాటి మధ్యవుండే పరస్పర సంబంధాలలోనో లేదా ఏకమొత్తంగానో గమనించడము మాత్రమేగాక, ప్రతి వైరుధ్యం తాలూకు రెండు అంశాలను కూడా తప్పనిసరిగా పరిశీలించాలి.

ఉదాహరణకు, కొమింటాంగ్‌నూ కమ్యూనిస్టు పార్టీనే తీసుకోండి. వాటిలో ఒక అంశమైన కొమింటాంగ్‌ను తీసుకోండి. మొదటి ఐక్యసంఘటనా కాలంలో కొమింటాంగ్; రష్యాతో మైత్రి, కమూనిస్టు పార్టీతో సహకారం, కార్మిక కర్షకులకు సహాయపడడం అనే సన్-యట్-సేన్ మూడు మహత్తర విధానాలను అమలు చేసింది. అందుచేత ఆ ఐక్యసంఘటన విప్లవకరంగానూ, శక్తివంతంగానూ



వుండి, ప్రజాస్వామిక విప్లవ సాధనకు వివిధ వర్గాల సమాఖ్యగా అయింది. అయితే 1927 తర్వాత, కొమింటాంగ్, తన వ్యతిరేకాంశంగా మారి, భూస్వాములు, బడా బూర్జువాల అభివృద్ధి నిరోధక కూటమిగా తయారయింది. 1936 డిశంబరులో సియాన్ సంఘటన తర్వాత, అంతర్యుద్ధాన్ని కట్టిపెట్టి జపాను సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించడానికి, కమ్యూనిస్టు పార్టీతో సహకరించే దిశలో మార నారంభించింది. ఈ మూడు దశలలో కొమింటాంగ్ యొక్క లక్షణాలు అలా వుండినాయి. అయితే ఈ లక్షణాలు, అనేక కారణాల నుండి ఉత్పన్నమయ్యాయనుకోండి. ఇపుడు రెండవ అంశమైన కమ్యూనిస్టు పార్టీని తీసుకోండి. మొదటి ఐక్యసంఘటనా కాలంలో, చైనా కమ్యూనిస్టుపార్టీ బాల్యదశలో వుండింది. అది 1924-27 విప్లవాన్ని ధైర్యంగానే నడిపిందిగానీ, విప్లవ స్వభావాన్ని, కర్తవ్యాలను, పద్ధతులను అర్థం చేసుకోవడంలో తన అపరిపక్వతను బైటపెట్టుకున్న కారణంగా ఈ విప్లవం ఉత్తర భాగంలో తలయెత్తిన చెన్ టు-షియిజం ప్రబలమవగల్గింది, విప్లవాన్ని ఓటమికి గురిచేయగల్గింది. 1927 తర్వాత కమ్యూనిస్టుపార్టీ సాహసోపేతంగా వ్యవసాయ విప్లవ యుద్ధాన్ని నడిపింది, విప్లవ సైన్యాన్ని, విప్లవ స్థావర ప్రాంతాలను నిర్మించింది. అయితే అది దుస్సాహసిక పొరపాట్లను చేసింది. ఆ కారణంగా సైన్యాలకు, విప్లవ స్థావర ప్రాంతాలకు చాలా పెద్దనష్టాలు వాటిల్లాయి. 1935 నుండి పార్టీ పొరపాట్లను సరిదిద్దుకొని, జపానును ప్రతిఘటించడానికి, కొత్త ఐక్యసంఘటనను నడుపుతోంది. ఈ మహత్తర పోరాటం ఇపుడు అభివృద్ధవుతోంది. ప్రస్తుత దశలో, కమ్యూనిస్టుపార్టీ, రెండు విప్లవాల పరీక్షలను గడిచి, పుష్కలమైన అనుభవాలను గడించుకొన్న పార్టీ. ఈ మూడుదశలలో చైనా కమ్యూనిస్టుపార్టీ లక్షణాలు యివి. ఈ లక్షణాలు కూడా అనేక కారణాల నుండి ఉత్పన్నమైనవే. ఈ రెండుపక్షాల లక్షణాలను అధ్యయనం చేయకుండా, వాటి వివిధ అభివృద్ధి దశలలో ఈ రెండు పార్టీల మధ్యవున్న ప్రత్యేక సంబంధాలను అంటే, ఐక్యసంఘటన ఏర్పాటు, ఐక్యసంఘటన విచ్ఛిత్తి మరో ఐక్యసంఘటన ఏర్పాటు అనేవాటిని అర్థంచేసుకోలేము. ఈ రెండు పార్టీల లక్షణాల అధ్యయనానికి మరింత మౌలికమైనదేమంటే, ఈ రెండు పార్టీల వర్గపునాదినీ, తత్ఫలితంగా విభిన్న కాలాల్లో, ఈ రెండు పార్టీలకు మధ్య ఇతర శక్తులకు మధ్య ఉత్పనమైన వైరుధ్యాలను పరిశీలించాలి అన్నదే. ఉదాహరణకు కమ్యూనిస్టు పార్టీతో మొదటి సహకార కాలంలో కొమింటాంగ్, విదేశీ సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించి నిలబడింది. అందుచేత అది సామ్రాజ్యవాద వ్యతిరేకి. మరోవంక, దేశంలోని అశేష జనబాహుళ్యానికి అది వ్యతిరేకమే. అది, శ్రమజీవి ప్రజానీకానికి అనేకానేక వాగ్దానాలు

చేసినప్పటికీ, వారికి వాస్తవంగా, దాదాపుగా ఏమీ చేయలేను. కొమింటాంగ్ కమ్యూనిస్టు వ్యతిరేక యుద్ధాన్ని కొనసాగించిన కాలంలో అది అశేష ప్రజా బాహుళ్యానికి వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదంతోనూ, భూస్వామ్య విధానంతోనూ షరీకై ఆ విప్లవంలో ప్రజలు సాధించుకున్న విజయాలన్నిటినీ తుడిచిపెట్టేసి, వారితో తనకున్న వైరుధ్యాన్ని తీవ్రతరం చేసుకుంది. జపాను వ్యతిరేక యుద్ధం నడుస్తున్న ప్రస్తుత కాలంలో, కొమింటాంగ్ జపాను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడి, కమ్యూనిస్టు పార్టీతో సహకరించాలని కోరుకుంటోంది. అయితే, కమ్యూనిస్టు పార్టీకి, ప్రజలకు, వ్యతిరేకమైన తన పోరాటాన్ని గానీ, వారిపై తన అణచివేతను గానీ ఏమాత్రం సడలించడం లేదు. ఇక కమ్యూనిస్టుపార్టీ మాటకువస్తే అది ఎల్లప్పుడు అన్ని కాలాలలోనూ సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానాలను వ్యతిరేకిస్తూ, అశేష ప్రజాబాహుళ్యపు పక్షాన వుంది. అయితే, ప్రస్తుత జపాను వ్యతిరేక యుద్ధకాలంలో అది, కొమింటాంగ్ జపానును ప్రతిఘటించడానికి సుముఖంగా వున్నానని చెప్పడంచేత, కొమింటాంగ్ పట్ల, దేశంలోని భూస్వామ్య శక్తులపట్ల కొంత మెతకవైఖరిని చేపట్టింది. పై పరిస్థితుల కారణంగా, రెండు పక్షాల మధ్య ఇంతలో సఖ్యమూ, ఇంతలో ఘర్షణా వుంటూ, సఖ్యత ఉన్నప్పుడు కూడా సఖ్యతతో పాటు ఘర్షణ కూడా వుండే క్లిష్టస్థితి వుండింది. వైరుధ్యం తాలూకు ఉభయ అంశాల ప్రత్యేక లక్షణాలను మనం అధ్యయనం చెయ్యకపోయ్యామంటే, ప్రతిపార్టీకి ఇతర శక్తులతో వుండే సంబంధాలను మాత్రమే కాక, ఆ రెండు పార్టీల మధ్య సంబంధాలను కూడా అర్థంచేసుకోలేము.

ఇందువల్ల తేలేదేమంటే ఏ విధమైన వైరుధ్యం యొక్క ప్రత్యేకతనుగానీ అధ్యయనం చేసేటపుడు - పదార్థపు ప్రతిచలన రూపంలోని వైరుధ్యము, దాని అభివృద్ధి ప్రక్రియలో ప్రతిదానిలోని వైరుధ్యమూ, ప్రతి ప్రక్రియలోని వైరుధ్యం యొక్క ఉభయ అంశాలూ, ఒక ప్రక్రియ తాలూకు ప్రతిఒక్క దశవద్ద వున్న వైరుధ్యమూ, ప్రతీ దశవద్ద వున్న వైరుధ్యం తాలూకు రెండు అంశాలు ఈ వైరుధ్యాలన్నిటి ప్రత్యేకతనూ అధ్యయనం చేసేటపుడు, మనం స్వీయ మానసిక ధోరణిని, స్వైర (arbitrary) ధోరణిని తప్పనిసరిగా విడనాడాలి, దాన్ని నిర్దిష్టంగా విశ్లేషించాలి. నిర్దిష్ట విశ్లేషణ లేనిదే ఏ వైరుధ్యం యొక్క విశిష్టతకు సంబంధించిన జ్ఞానం ఏదీ ఉండజాలదు. నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణ అనే లెనిన్ బోధనను మనం సదా గుర్తుంచుకోవాలి.



అలాంటి నిర్దిష్ట విశ్లేషణకు సంబంధించిన ఒక అద్భుతమైన నమూనాను మనకు మార్క్స్, ఎంగెల్స్‌లు ప్రప్రథమంగా ప్రసాదించారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు సామాజిక, చారిత్రక క్రమాన్ని అధ్యయనం చేయడానికి, వస్తువులలోని వైరుధ్యం సూత్రాన్ని అన్వయించినపుడు, వారు ఉత్పత్తి శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య వైరుధ్యాన్ని కనుగొన్నారు. దోపిడీ వర్గాలకూ, దోపిడీకి గురైన వర్గాలకూ మధ్యవున్న వైరుధ్యాన్ని కనుగొన్నారు. తత్ఫలితంగా, ఆర్థిక పునాదికీ, ఉపరితలానికీ, (రాజకీయాలు, భావజాలం వగైరాలు) మధ్య ఉత్పన్నమయ్యే వైరుధ్యాన్ని కూడా కనుగొన్నారు. ఈ వైరుధ్యాలు ఏ విధంగా వివిధ రకాల వర్గసమాజాలలో వేరువేరు రకాల సామాజిక విప్లవాలకు అనివార్యంగా దారితీస్తాయో వారు కనుగొన్నారు.

మార్క్స్, పెట్టుబడిదారీ సమాజ ఆర్థిక వ్యవస్థ అధ్యయనంలో ఈ సూత్రాన్ని అన్వయించినపుడు, ఉత్పత్తి యొక్క సామాజిక స్వభావానికి, యాజమాన్యపు ప్రైవేటు స్వభావానికీ మధ్యనున్న వైరుధ్యమే, ఈ సమాజంలోని మౌలిక వైరుధ్యమని ఆయన కనుగొన్నారు. ఈ వైరుధ్యం, విడివిడి సంస్థల (individual enterprises) లోని ఉత్పత్తి యొక్క సంఘటిత స్వభావానికి (organised character), మొత్తం సమాజంలోని ఉత్పత్తి తాలూకు అరాజక స్వభావానికీ, మధ్య నుండే వైరుధ్యంలో తన్నుతాను వ్యక్తపర్చుకుంటుంది. వర్గసంబంధాల దృష్ట్యా ఇది బూర్జువా వర్గానికీ, శ్రామిక వర్గానికీ మధ్యన వైరుధ్యంలో వ్యక్తమవుతుంది.

వస్తుజాలం అసంఖ్యాకం కావడాన, వాటి అభివృద్ధికి ఏ పరిమితీ లేక పోవడాన, ఒక సందర్భంలో విశ్వజనీనమైనదే మరో సందర్భంలో ప్రత్యేకం అవచ్చు. అలాగే, ఒక సందర్భంలో ప్రత్యేకమైనది మరో సందర్భంలో విశ్వజనీనమైనదవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థలో, ఉత్పత్తి యొక్క సామాజిక స్వభావానికీ, ఉత్పత్తి సాధనాలు వ్యక్తుల సొంతం కావడానికీ మధ్య వుండే వైరుధ్యం, పెట్టుబడిదారీ విధానం నెలకొని వుండి, అభివృద్ధి చెందుతున్న దేశాలన్నిటా వుండే సామాన్య వైరుధ్యమే. పెట్టుబడిదారీ విధానానికి సంబంధించినంత వరకూ, ఇది వైరుధ్యం యొక్క విశ్వజనీనతే. అయితే పెట్టుబడిదారీ విధానపు ఈ వైరుధ్యం, వర్గసమాజ సాధారణ అభివృద్ధిలోని ఒకానొక చారిత్రక దశకు మాత్రమే చెందుతుంది. వర్గసమాజం మొత్తానికి సంబంధించి, ఉత్పత్తి శక్తులకు ఉత్పత్తి సంబంధాలకు మధ్య వుండే వైరుధ్యం విషయానికి వస్తే ఇది వైరుధ్యపు

ప్రత్యేకత. అయితే, పెట్టుబడిదారీ సమాజంలోని ఈ వైరుధ్యాలన్నిటి తాలూకు ప్రత్యేకతను సునిశితంగా పరిశీలించే క్రమంలో మార్క్స్ వర్గసమాజమంతటా, ఉత్పత్తి శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకు మధ్యనుండే వైరుధ్యం తాలూకు విశ్వజనీనతను గురించి మరింత లోతైన, మరింత సమర్థవంతమైన, మరింత సమగ్రమైన వివరణను ఇచ్చారు.

ప్రత్యేకత విశ్వజనీనతలో సమైక్యమై వుంది కనుక, ప్రతిదానిలోనూ వైరుధ్యం తాలూకు విశ్వజనీనత, ప్రత్యేకతలు నిబిడీకృతమై వుంటాయి కనుకనూ, ప్రత్యేకతలోనే విశ్వజనీనత వున్నది కనుకనూ, మనం ఒక వస్తువును అధ్యయనం చేసేటప్పుడు విశ్వజనీనత ప్రత్యేకత ఈ రెండింటిని, వాటి పరస్పర సంబంధాన్ని కనుగొననెత్నించాలి. విశ్వజనీనతను, ప్రత్యేకతను ఆ వస్తువులోపలే వాటి మధ్య వున్న పరస్పర సంబంధాన్ని, ఈ వస్తువుకు వెలుపలి ఇతర వస్తువులతో వున్న పరస్పర సంబంధాలను మనం కనుగొననెత్నించాలి. స్టాలిన్ తన ప్రఖ్యాత రచన "లెనినిజం పునాదులు"లో లెనినిజం తాలూకు చారిత్రిక మూలాలను గురించి వివరిస్తూ, ఏ అంతర్జాతీయ పరిస్థితులలో లెనినిజం ఆవిర్భవించిందో దాన్ని గురించి, సామ్రాజ్యవాదంతో పరాకాష్టకు చేరుకున్న పెట్టుబడిదారీ విధానపు వైరుధ్యాలను గురించి విశ్లేషించాడు. ఈ వైరుధ్యాలు ఎలా శ్రామికవర్గ విప్లవాన్ని తక్షణ కార్యక్రమంగా చేసి, పెట్టుబడిదారీ విధానాన్ని సూటిగా దెబ్బతీయడానికి అనుకూలమైన పరిస్థితులను సృష్టించాయో నిరూపించాడు. దీనికన్నా కూడా, రష్యా లెనినిజానికి క్షేత్రమవడానికి గల కారణాలనూ, జారిస్టు రష్యా సామ్రాజ్యవాదపు సకల వైరుధ్యాలకు కూడలి ఎలా అయిందో, రష్యా శ్రామిక వర్గానికి అంతర్జాతీయ విప్లవ శ్రామిక వర్గపు అగ్రగామి దళంగా అవడం ఎలా సాధ్యమైందో ఆయన విశ్లేషించారు. ఈ విధంగా స్టాలిన్ లెనినిజం, సామ్రాజ్యవాద, శ్రామికవర్గ విప్లవాల శకానికి చెందిన మార్క్సిజమేనని చూపుతూ, సామ్రాజ్యవాదంలోని వైరుధ్యం యొక్క విశ్వజనీనతను విశ్లేషించడమేగాక, అదే సమయంలో, ఈ సాధారణ వైరుధ్యం అంతరంగంలోని జారిస్టు రష్యా సామ్రాజ్యవాదపు ప్రత్యేకతనూ విశ్లేషించాడు. రష్యా, శ్రామికవర్గ విప్లవ సిద్ధాంతానికి, ఎత్తుగడలకు ఎలా జన్మస్థలమయిందో, ఈ ప్రత్యేకతలో వైరుధ్యపు విశ్వజనీనత ఎలా యిమిడివున్నదో చూపించాడు. మనం వైరుధ్యం యొక్క విశ్వజనీనతనూ, ప్రత్యేకతనూ రెంటిమధ్య



నుండే పరస్పర సంబంధాన్ని గురించి అర్థంచేసుకోడానికి స్టాలిన్ చేసిన ఈ విశ్లేషణను ఒక నమూనాగా తీసుకోవాలి.

వాస్తవ దృగ్విషయాల అధ్యయనంలో, గతితర్కాన్ని వినియోగించడం అనే సమస్య గురించి, మార్క్స్, ఎంగెల్సులు; అలానే లెనిన్, స్టాలిన్‌లు, స్వీయ మానసిక ధోరణులను, స్వైరపద్ధతినీ ఎంతమాత్రమూ అవలంబించరాదనీ, ఈ దృగ్విషయాల వాస్తవ భౌతిక చలనానికి చెందిన నిర్దిష్ట పరిస్థితుల నుండి, వాటి నిర్దిష్ట వైరుధ్యాలను, ప్రతీఒక్క వైరుధ్యం తాలూకు ప్రతి అంశపు నిర్దిష్ట స్థానాన్ని, ఈ వైరుధ్యాల మధ్య వుండే నిర్దిష్టమైన పరస్పర సంబంధాలను కనుగొనాలని మనకు సదా వుద్బోధించారు. మన పిడివాదులకు, అధ్యయనంలో ఈ వైఖరిలేదు. అందుచేత వారు ఏదీ సరిగా గ్రహించలేరు. మనం వారి వైఫల్యాన్ని ఒక హెచ్చరికగా తీసుకొని, అధ్యయనానికి ఒక సరైన మార్గమైన ఈ వైఖరిని అవలంబించడం నేర్చుకోవాలి.

వైరుధ్యం యొక్క విశ్వజనీనతకు, ప్రత్యేకతకు మధ్యన సంబంధం వైరుధ్యం యొక్క సాధారణ స్వభావానికీ ప్రత్యేక (individual) స్వభావానికి మధ్యనుండే సంబంధమే. మొదటి మాటకు అర్థమేమంటే, వైరుధ్యం అన్ని ప్రక్రియలలోనూ, మొదటినుండి చివరిదాకా వుంటూనే వస్తుంది. చలనం, వస్తువులు, ప్రక్రియలు, ఆలోచనా-అన్నీ వైరుధ్యాలే. వైరుధ్యాన్ని నిరాకరించడమంటే సర్వాన్నీ నిరాకరించడమే. సర్వకాల సర్వావస్థలలోనూ ఇది పరమసత్యం. దీనికి అపవాదు అంటూ లేదు. అందుచేతనే వైరుధ్యం సర్వసాధారణమైనది; నిత్యమైనది. అయితే ఈ సాధారణ స్వభావం ప్రతిప్రత్యేక (individual) స్వభావంలోనూ వుంటుంది. ప్రత్యేక (individual) స్వభావం లేకుండా సాధారణ స్వభావం వుండదు. ప్రత్యేక (individual) స్వభావాలనన్నిటినీ తొలగిస్తే మిగిలే సాధారణ స్వభావం ఏముంటుంది ? ప్రతి వైరుధ్యమూ ప్రత్యేకమైనది కనుకనే, ప్రత్యేక (individual) స్వభావం ఉత్పన్నమవుతుంది. ప్రత్యేక (individual) స్వభావమంతా, నియమబద్ధంగానూ(conditionally) తాత్కాలికంగానూ వుంటుంది. కాబట్టి అది సాపేక్షం.

సాధారణ, ప్రత్యేక (individual) స్వభావాలకు సంబంధించిన, నిత్యత్వానికి, సాపేక్షత్వానికి సంబంధించిన ఈ సత్యం, వస్తువులలోని వైరుధ్యాల సమస్యలో నిగ్గుదేలిన సారం. దీన్ని అవగతం చేసుకోకపోవడమంటే, గతితర్కానికి ఉద్వాసన చెప్పడమే.

## 4. ప్రధాన వైరుధ్యమూ, వైరుధ్యంలోని ప్రధాన అంశమూ

వైరుధ్యం యొక్క ప్రత్యేకతా సమస్యలో, ప్రత్యేకించి విశ్లేషించాల్సిన అంశాలు ఇంకా రెండున్నాయి. అవి, ప్రధాన వైరుధ్యమూ, వైరుధ్యంలోని ప్రధాన అంశమూ.

ఒక సంక్లిష్ట వస్తువు అభివృద్ధి ప్రక్రియలో అనేక వైరుధ్యాలుంటాయి. వాటిలో ఒకటి విధిగా ప్రధాన వైరుధ్యమై వుండి, దాని ఉనికి, అభివృద్ధి ఇతర వైరుధ్యాల ఉనికి అభివృద్ధులను నిర్ణయిస్తాయి లేదా ప్రభావితం చేస్తాయి.

ఉదాహరణకు పెట్టుబడిదారీ సమాజంలో వైరుధ్యంలో వుండే శక్తులైన శ్రామికవర్గం, బూర్జువా వర్గాలు, ప్రధాన వైరుధ్యాన్ని ఏర్పరుస్తాయి. భూస్వామ్య వర్గ అవశేషాలకూ బూర్జువా వర్గానికీ మధ్య, రైతాంగ పెట్టీబూర్జువాజీకీ బూర్జువాజీకి మధ్య, శ్రామిక వర్గానికీ రైతాంగ పెటీబూర్జువాజీకి మధ్య, గుత్తపెట్టుబడిదారులకూ గుత్తేతర పెట్టుబడిదారులకూ మధ్య, బూర్జువా ప్రజాస్వామ్యానికీ బూర్జువా ఫాసిజానికీ మధ్యా, పెట్టుబడిదారీ దేశాల నడుమా, సామ్రాజ్యవాదానికీ వలసలకీ మధ్యా, వుండే వైరుధ్యాల వంటి ఇతర వైరుధ్యాలు, ఈ ప్రధాన వైరుధ్యాన్నిబట్టి నిర్ణీతమవుతాయి లేదా దానివల్ల ప్రభావితమవుతాయి.

చైనావంటి అర్ధవలస దేశంలో, ప్రధాన వైరుధ్యానికీ, ప్రధానేతర (non-principal) వైరుధ్యాలకు మధ్యవుండే సంబంధం గజిబిజిగా వుంటుంది.

అటువంటి దేశం మీదికి సామ్రాజ్యవాదం, దురాక్రమణ యుద్ధానికి దిగినపుడు కొందరు దేశద్రోహులు మినహా ఆ దేశంలోని అన్ని వర్గాలూ, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా జాతీయ యుద్ధంలో తాత్కాలికంగా ఐక్యమవగలరు. అటువంటి సమయంలో సామ్రాజ్యవాదానికీ, దాని దాడికి గురైన దేశానికీ మధ్యనుండే వైరుధ్యమే ప్రధాన వైరుధ్య మవుతుంది. కాగా, దేశంలోని వివిధ వర్గాల మధ్య వున్న ఇతర వైరుధ్యాలన్నీ (ఇంతదాకా ప్రధాన వైరుధ్యంగా వుండిన భూస్వామ్య విధానానికి, అశేష జన బాహుళ్యానికీ మధ్యవున్న వైరుధ్యంతో సహా) తాత్కాలికంగా రెండవ శ్రేణికి, తక్కువ స్థాయికి దిగిపోతాయి. చైనాలో 1840 నాటి నల్లమందు యుద్ధంలో అదే జరిగింది. 1894 లోని చైనా-జపాను యుద్ధంలోనూ అదే జరిగింది. 1900లో యిహోటువాన్ యుద్ధంలోనూ అదే జరిగింది. ప్రస్తుత చైనా జపాన్ యుద్ధంలోనూ కూడా అదే జరుగుతోంది.



కానీ మరొక పరిస్థితిలో, వైరుధ్యాల స్థితి మారుతుంది. సామ్రాజ్యవాదం తన అణచివేతను, యుద్ధం ద్వారా కాక కొంచెం సౌమ్యమైన రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పద్ధతుల ద్వారా కొనసాగించినపుడు, అర్ధవలస దేశాలలోని పాలక వర్గాలు, సామ్రాజ్యవాదానికి దాసోహమవుతాయి. ప్రజాబాహుళ్యాన్ని ఉమ్మడిగా అణచివేయటానికి అవిరెండూ సమైక్యమవుతాయి. అటువంటి సమయాల్లో ప్రజలు తరచుగా సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్య వర్గాల కూటమికీ వ్యతిరేకంగా అంతర్ యుద్ధాన్ని సాగిస్తారు. కాగా సామ్రాజ్యవాదం, అర్ధవలస దేశాలలోని అభివృద్ధి నిరోధకులకు ప్రజలపై అణచివేతను కొనసాగించడంలో ప్రత్యక్ష పద్ధతుల్లో కాక పరోక్ష పద్ధతుల్లో సహాయాన్నందిస్తుంది. ఈ విధంగా అంతర్గత వైరుధ్యాలు చాలా తీక్షణ మవుతాయి. చైనాలో 1911 నాటి విప్లవ యుద్ధంలోనూ, 1924-27 నాటి విప్లవయుద్ధంలోనూ, 1927 తర్వాత 10 ఏళ్ళ వ్యవసాయ విప్లవ యుద్ధంలోనూ అదే జరిగింది. అర్ధవలస దేశాలలోని వివిధ అభివృద్ధి నిరోధక పాలక వర్గాలమధ్య యుద్ధాలు కూడా ఇదే కోవకు చెందుతాయి. ఉదాహరణకు చైనాలో యుద్ధప్రభువుల మధ్య యుద్ధాలు.

విప్లవ అంతర్యుద్ధం సామ్రాజ్యవాదుల, దాని కావలి కుక్కలైన దేశీయ అభివృద్ధి నిరోధకుల ఉనికికే ఎసరుపెట్టే స్థాయికి అభివృద్ధి చెందినపుడు, సామ్రాజ్య వాదం తన ఏలుబడిని నిలుపుకునేందుకు తరచుగా యితర పద్ధతులను చేబడుతుంది. విప్లవశ్రేణిని లోపలినుంచి చీల్చటానికై ప్రయత్నిస్తుంది. లేదా, దేశీయ అభివృద్ధి నిరోధకులకు ప్రత్యక్షంగా సాయపడేందుకు సాయుధ బలగాలను పంపుతుంది. అటువంటి సమయంలో, విదేశీ సామ్రాజ్యవాదమూ, దేశీయ అభివృద్ధి నిరోధకులు, నగ్నంగా ఒక కోవున నిలబడతారు, అశేష ప్రజాబాహుళ్యం రెండోకోవున నిలబడుతుంది. ఆ విధంగా అది ప్రధాన వైరుధ్యమై, ఇతర వైరుధ్యాల అభివృద్ధిని నిర్ణయిస్తుంది లేదా వాటిపై ప్రభావం చూపుతుంది. అక్టోబరు విప్లవానంతరం, రష్యను అభివృద్ధి నిరోధకులకు అనేక పెట్టుబడిదారీ దేశాలు చేసిన సాయం, సాయుధ జోక్యానికి ఉదాహరణ. 1927లో చియాంగ్‌కై-షేక్ విద్రోహం, విప్లవ శ్రేణిని చీల్చడానికి ఉదాహరణ.

ఏమి జరిగినప్పటికీ, ఒక ప్రక్రియ అభివృద్ధిలోని ప్రతీ దశలోనూ ఒకే ఒక ప్రధాన వైరుధ్యం వుంటుంది. అది ప్రముఖపాత్ర వహిస్తుందనడానికి ఎలాంటి సందేహమూ లేదు.

కనుక ఏ ప్రక్రియలోనైనా అనేక వైరుధ్యాలున్నపుడు, వాటిలో ఒకటి తప్పనిసరిగా, ప్రముఖమైన, నిర్ణాయకమైన పాత్ర వహించే ప్రధాన వైరుధ్యం అవాలి. మిగిలినవి ద్వితీయ, అప్రధాన స్థానాల్లో వుంటాయి. అందుచేత రెండుగానీ, అంతకు మించిగానీ వైరుధ్యాలు వున్న ఏ సంక్లిష్ట ప్రక్రియను అధ్యయనం చేసేటపుడైనా మనం, ప్రధాన వైరుధ్యాన్ని కనిపెట్టడానికి శాయశక్తులా ప్రయత్నించి తీరాలి. ఈ ప్రధాన వైరుధ్యం దొరికిందంటే అన్ని సమస్యలూ తేలికగా పరిష్కారమవుతాయి. పెట్టుబడిదారీ సమాజాన్ని గురించిన తన అధ్యయనంలో మార్క్స్ మనకు ఈ పద్ధతినే బోధించారు. అదేవిధంగా లెనిన్ స్టాలిన్‌లు సామ్రాజ్యవాదాన్ని, పెట్టుబడిదారీ విధానంలో సాధారణ సంక్షోభాన్ని అధ్యయనం చేసినపుడు, సోవియట్ ఆర్థిక వ్యవస్థను అధ్యయనం చేసినపుడు మనకు ఇదే పద్ధతిని బోధించారు. దీన్ని గ్రహించలేని పండితులూ, కార్యసాధకులూ వేలసంఖ్యలోనే వున్నారు. వారు అయోమయంలో కొట్టుకుంటూ, సమస్య కీలకాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. అందువల్ల సహజంగానే దాని వైరుధ్యాలను పరిష్కరించడానికి మార్గాన్ని కనుగొనలేరు.

ముందే చెప్పినట్టు, ఒక ప్రక్రియలోని వైరుధ్యాలనన్నిటినీ ఒకే గాటన కట్టి చూడకూడదు. ప్రధాన వైరుధ్యానికి, అప్రధాన వైరుధ్యాలకు మధ్య తేడాను చూడాలి. ప్రధాన వైరుధ్యాన్ని దొరకబట్టుకోవడంపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అయితే, ఒక వైరుధ్యంలో అది ప్రధానమైనదైనా ద్వితీయమైనదైనా దానిలోని విరుద్ధాంశాలను రెంటినీ సమమైన వాటిగానే పరిగణించాలా? కానేకాదు. ఏ వైరుధ్యంలోనైనా, విరుద్ధాంశాల అభివృద్ధి అసమానంగా వుంటుంది. కొన్ని కొన్ని సార్లు అవి రెండూ సమతుల్యంలో వున్నట్టు కనిపిస్తాయి. అయితే, అది కేవలం తాత్కాలికం, సాపేక్షికం, కాగా అసమానత మౌలికమైనది. రెండు విరుద్ధాంశాలలో ఒకటి ప్రధానమైనదై తీరాలి, రెండవది ద్వితీయమైన దవాలి. వైరుధ్యంలో ప్రధాన పాత్ర వహించేదే ప్రధానాంశం. వైరుధ్యంలో ప్రధానాంశంగా వుండి, ప్రబల స్థానాన్ని చేజిక్కించుకున్న అంశమే, ఆ వస్తువు స్వభావాన్ని నిర్ణయిస్తుంది.

కానీ, ఈ పరిస్థితి స్థిరమైనదికాదు. ఒక వైరుధ్యంలోని ప్రధాన, అప్రధాన అంశాలు, ఒకటి ఇంకొక దానిలోకి రూపాంతరం చెందుతాయి. వస్తువు స్వభావం తదనుగుణంగానే మారుతుంది. ఒకానొక ప్రక్రియలోగానీ, ఒక వైరుధ్యాభివృద్ధి ఒకానొక దశలోగానీ A ప్రధానాంశం, B అప్రధానాంశంగాను వుంటాయి. మరో



దశలోగానీ, మరో ప్రక్రియలోగానీ ఈ పాత్రలు తారుమారవుతాయి. వస్తు అభివృద్ధి క్రమంలో ప్రతి అంశమూ రెండో దానితో పడే ఘర్షణలో దానిశక్తి పెరగడంగానీ, తగ్గడంగానీ ఏ మేరకు జరుగుతుంది అన్నదాన్నిబట్టి ఈ మార్పు నిర్ణీతమవుతుంది.

"పాతదాన్ని కొత్తది వచ్చి కొట్టేయడం" గురించి మనం తరచూ మాట్లాడతాం. పాతదిపోయి, కొత్తది రావడం అనేది, విశ్వంలోనే ఒక సర్వ సాధారణమూ, శాశ్వతమూ, అనుల్లంఘనీయమూ అయిన నియమం. ఒక వస్తువు, దానిసారం, బాహిర పరిస్థితుల కనుగుణ్యంగా, వివిధ రూపాలలోని గెంతుల ద్వారా మరోదానిగా రూపాంతరం చెందటం-పాతదాన్ని కొట్టేసి కొత్తది రావడం అనే ప్రక్రియ ఇది. ప్రతీ వస్తువులోనూ, దాని కొత్త, పాత అంశాలమధ్య వైరుధ్యం వుంటుంది. ఇది అనేక మలుపులు, మెలికలతో కూడుకునివున్న ఘర్షణల పరంపరకు కారణభూత మవుతుంది. ఈ ఘర్షణల ఫలితంగా, కొత్త అంశం, అప్రధానంగా వుండడం నుండి, ప్రధానమైనదిగా మారి ప్రాబల్యాన్ని సంతరించుకుంటుంది. కాగా, పాతది ప్రధానంగా వుండడం నుండి అప్రధానమైనదిగా మారి, క్రమక్రమంగా నశించిపోతుంది. కొత్త అంశం, పాతదానిమీద ఎప్పుడైతే ఆధిక్యతను సాధిస్తుందో, పాత వస్తువు, కొత్త వస్తువుగా గుణాత్మకంగా మార్పు చెందుతుంది. అందుచేత, ఒక వస్తువు స్వభావం, ప్రధానంగా వైరుధ్యంలోని ప్రధానాంశంచే, ప్రాబల్యాన్ని సంపాదించుకున్న అంశంచే నిర్ణీతమవుతుందని గమనించవచ్చు. ప్రాబల్యాన్ని సంపాదించుకున్న ప్రధానాంశం మారినప్పుడు, తదనుగుణంగానే వస్తు స్వభావం కూడా మారుతుంది.

పెట్టుబడిదారీ సమాజంలో, పెట్టుబడిదారీ విధానం, పాత భూస్వామ్య యుగంలో ద్వితీయ శక్తిగా వుండిన తన స్థానం నుండి, ప్రాబల్యశక్తి స్థానానికి మారింది. సమాజ స్వభావం కూడా తదనుగుణంగానే, భూస్వామ్యం నుండి పెట్టుబడిదారీకి మారింది. కొత్త పెట్టుబడిదారీ యుగంలో భూస్వామ్య శక్తులు తమ పాత ప్రాబల్య స్థితినుండి అప్రధాన స్థితికి మారి క్రమంగా అంతరిస్తాయి. బ్రిటన్‌లోనూ, ఫ్రాన్స్‌లోనూ అలాగే జరిగింది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి అయ్యేకొద్దీ బూర్జువా వర్గం, పురోగామి పాత్ర వహిస్తున్న ఒక కొత్త వర్గం స్థితి నుండి అభివృద్ధి నిరోధక పాత్ర వహించే పాత వర్గంగా మారుతుంది. చిట్టచివరకు అది శ్రామిక వర్గంచే కూలదోయబడి తమ సొంతంగా వుండిన ఉత్పత్తి సాధనాలను కోల్పోయిన, అధికారాన్ని కోల్పోయిన వర్గంగా అయి క్రమంగా అంతరిస్తుంది. బూర్జువాల కంటే

అధిక సంఖ్యాకమూ, బూర్జువా వర్గంతో పాటే పుట్టి, దాని పాలన కిందే పెరిగినదీ అయిన కార్మికవర్గం ఒక కొత్త శక్తి. అది తొలుత బూర్జువా వర్గానికి లోబడి వుండినా, క్రమక్రమంగా శక్తిని సంపాదించుకొని, చరిత్రలో ప్రధాన పాత్రను నిర్వహించే స్వతంత్ర వర్గంగా అవుతుంది. చివరికి రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకొని, పాలకవర్గమవుతుంది. దాని మూలంగా సమాజ స్వభావం మారుతుంది: పాత పెట్టుబడిదారీ సమాజం, కొత్త సోషలిస్టు సమాజమవుతుంది. సోవియట్ యూనియన్ ఈ బాటను యిప్పుడే అనుసరించింది. ఇతర దేశాలన్నీ విధిగా ఈ మార్గాన్నే పయనిస్తాయి.

ఉదాహరణకు చైనానే తీసుకోండి. చైనాను ఒక అర్ధవలసగా దిగజార్చిన వైరుధ్యంలో, సామ్రాజ్యవాదం ప్రాధాన్యం గల స్థితిలో వుంది. అది చైనా ప్రజలను పీడిస్తోంది. చైనా స్వతంత్ర దేశ స్థితి నుండి, అర్ధవలస దేశంగా మార్చబడింది. అయితే ఈ పరిస్థితి విధిగా మారుతుంది. ఉభయపక్షాల మధ్య ఘర్షణలో కార్మికవర్గ నాయకత్వం కింద పెంపొందుతున్న చైనా ప్రజాశక్తి, అర్ధవలసగా వున్న చైనాను స్వతంత్ర దేశంగా తప్పనిసరిగా మారుస్తుంది. కాగా సామ్రాజ్యవాదం కూలదోయబడుతుంది. పాతచైనా, తప్పనిసరిగా కొత్తచైనాగా మారుతుంది.

పాతచైనా కొత్తచైనాగా మారడంలో పాత భూస్వామ్య శక్తులకూ, దేశంలోని నూతన ప్రజాశక్తులకూ మధ్య సంబంధం మారడం కూడా వుంటుంది. పాత, భూస్వామ్యవర్గం కూలదోయబడి, పాలకుల నుండి పాలితులుగా మారి, ఈ వర్గం కూడా క్రమంగా నశించిపోతుంది. పాలితులుగా వున్న ప్రజలు, శ్రామికవర్గ నాయకత్వంలో, పాలకులవుతారు. అందుమీదట చైనా సమాజ స్వభావం మారుతుంది. పాత, అర్ధవలస, అర్ధ భూస్వామ్య సమాజం, నూతన ప్రజాస్వామిక సమాజంగా మారుతుంది.

ఇలాంటి పరస్పర రూపాంతరీకరణలకు నిదర్శనాలు మన పూర్వానుభవంలో కనబడుతాయి. చైనాను ఇంచుమించు మూడువందలయేళ్ళు పాలించిన చింగ్ రాజ వంశం 1911 విప్లవంతో పతనమయింది. సన్‌యట్-సేన్ నాయకత్వం కింద విప్లవాత్మక "టంగ్‌మెంగ్ హుయ్" కొంతకాలం విజయం సాధించింది. 1924-27 విప్లవ యుద్ధంలో, దక్షిణాదిలోని కమ్యూనిస్టు కొమింటాంగ్ సమైక్య విప్లవ బలగాలు; దుర్బలస్థితి నుండి బలమైన వాటిగా మారి, ఉత్తరాది దండయాత్రలో విజయాన్ని సాధించాయి. కాగా, ఒకప్పుడు తమ ప్రతాపం చూపించిన ఉత్తరాది



యుద్ధ ప్రభువులు పతనమయ్యారు. 1927 లో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం కింద ప్రజాబలగాలు, కొమింటాంగ్ ప్రతీఘాతుక చర్యల మూలంగా సంఖ్యాపరంగా అమితంగా క్షీణించాయి, కానీ తమ శ్రేణులలోని అవకాశవాదాన్ని తొలగించుకొన్న తర్వాత అవి క్రమంగా బలాన్ని పుంజుకున్నాయి. కమ్యూనిస్టు నాయకత్వం కింద వున్న విప్లవ స్థావర ప్రాంతాల్లో రైతులు, పాలితుల స్థితినుండి పాలకులుగా రూపాంతరం చెందారు. అదే సమయంలో భూస్వాముల స్థితి దీనికి విరుద్ధంగా మారింది. ప్రపంచంలో ఎప్పుడూ ఇంతే - కొత్తదివచ్చి పాతదాని స్థానాన్ని ఆక్రమిస్తుంది. పాత కొత్తకు చోటుఇస్తుంది. పాతదాని నుండి కొత్తది పుట్టుకొస్తుంది.

విప్లవ పోరాటంలో కొన్ని సమయాల్లో, అనుకూల పరిస్థితులకన్న ఇబ్బందులే ఎక్కువ మోతాదులో వుంటాయి. అందుచేత అవి వైరుధ్యంలో ప్రధానాంశమవుతాయి. అనుకూల పరిస్థితులు ద్వితీయమైన మవుతాయి. కానీ విప్లకారులు తమ ప్రయత్నాలద్వారా ఇబ్బందులను ఒకటొకటిగా అధిగమించి, అనుకూల పరిస్థితులను సాధించగలరు. ఆ విధంగా అననుకూల పరిస్థితులు తొలగి అనుకూల పరిస్థితి వస్తుంది. 1927లో చైనాలోని విప్లవం విఫలమైన తర్వాత, చైనా ఎర్రసైన్యపు లాంగ్ మార్చ్‌లోనూ ఇదే జరిగింది. నేటి, చైనా-జపాను యుద్ధంలో చైనా క్లిష్ట పరిస్థితిలో పడింది. కానీ, మనం దాన్ని మార్చి: చైనా, జపానుల మధ్యగల పరిస్థితిని మౌలికంగానే పరివర్తన పొందించగలం. దీనికి వ్యతిరేకంగా, విప్లవకారులు పొరపాట్లు చేసినట్లయితే, అనుకూల పరిస్థితులు కూడా క్లిష్టంగా మారవచ్చు. 1924-27 విప్లవ విజయం ఇలాగే అపజయంగా మారింది. 1927 తర్వాత, దక్షిణ రాష్ట్రాలలో వృద్ధి చెందిన విప్లవ స్థావర ప్రాంతాలన్నీ 1934 నాటికి అపజయాన్ని చవిచూశాయి.

మనం అధ్యయనము చేసేటప్పుడు, అజ్ఞానంనుండి జ్ఞానానికి పోయేబాటలోని వైరుధ్యానికి కూడా ఇది వర్తిస్తుంది. మనం ప్రప్రథమంగా మార్క్సిజాన్ని అధ్యయనం చేసేటపుడు, మార్క్సిజాన్ని గురించి మనకున్న అజ్ఞానం లేదా అరకొర జ్ఞానం, మార్క్సిస్టు జ్ఞానానికి విరుద్ధ దిశలో వుంటుంది. అయితే ఓపిగ్గా, కష్టపడి అధ్యయనం చేయడం ద్వారా, అజ్ఞానాన్ని జ్ఞానంగా మార్చుకోవచ్చు. అరకొర జ్ఞానాన్ని ప్రగాఢ జ్ఞానంగా మార్చుకోవచ్చు. మార్క్సిజాన్ని గుడ్డిగా అన్వయించడాన్ని, నైపుణ్యంతో అన్వయించేటట్టుగా మార్చుకోవచ్చు.

ఇది కొన్ని వైరుధ్యాలకు వర్తించదని కొందరనుకుంటారు. ఉదాహరణకు, ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్యవుండే వైరుధ్యంలో ఉత్పత్తి

శక్తులే ప్రధానాంశం. ఆర్థిక పునాదికీ, ఉపరితల నిర్మాణానికి మధ్యవుండే వైరుధ్యంలో ఆర్థిక పునాదే ప్రధానాంశం. సిద్ధాంతం, ఆచరణల మధ్యవుండే వైరుధ్యంలో ఆచరణే ప్రధానాంశం. వాటివాటి స్థానాల్లో మార్పు ఉండదు అనేది యాంత్రిక భౌతికవాద దృక్పథం, గతితార్కిక భౌతికవాద దృక్పథంకాదు. ఉత్పత్తి శక్తులూ, ఆచరణా, ఆర్థిక పునాదీ, సాధారణంగా ప్రధానమైన, నిర్ణయాత్మకమైన పాత్రను వహిస్తాయన్నది నిజమే. దీన్ని నిరాకరించేవాడు భౌతికవాది కానేకాడు. అయితే కొన్ని పరిస్థితులలో, ఉత్పత్తి సంబంధాలు, సిద్ధాంతం, ఉపరితల నిర్మాణం వంటి అంశాలు, ప్రధానమైన నిర్ణయాత్మకమైన పాత్రలో వ్యక్తమవుతాయని కూడా ఒప్పుకోక తప్పదు. ఉత్పత్తి సంబంధాలలో మార్పు జరగనిదే, ఉత్పత్తి శక్తుల అభివృద్ధి అసంభవమైనపుడు, ఉత్పత్తి సంబంధాలలో మార్పు ప్రధాన నిర్ణాయక పాత్రను వహిస్తుంది. "విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవోద్యమం వుండజాలదు"[15] అని లెనిన్ ఏ కాలాల గురించయితే చెప్పారో, ఆ కాలాల్లో విప్లవ సిద్ధాంతాన్ని సృష్టించి, ప్రబోధించడం, ప్రధాన, నిర్ణాయక పాత్రను వహిస్తుంది. ఒక కర్తవ్యం నిర్వర్తించ వలసి వుండి, అది ఏదైనా కానీ, దానికి ఒక మార్గదర్శక సూచనగానీ, పద్ధతిగానీ, ప్రణాళికా లేక విధానంగానీ అప్పటికింకా లేని పరిస్థితిలో సూచననీ, పద్ధతినీ, ప్రణాళికనూ లేక విధానాన్ని నిర్ణయించడమే ప్రధాన నిర్ణాయక విషయ మవుతుంది. ఉపరితల నిర్మాణం (రాజకీయాలు, సాంస్కృతిక వగైరాలు), ఆర్థిక పునాది అభివృద్ధికి ప్రతిబంధకమైనపుడు, రాజకీయ సాంస్కృతిక మార్పులే ప్రధానమూ, నిర్ణాయకమూ అవుతాయి ఇలా అంటే మనం భౌతికవాదాన్ని వ్యతిరేకిస్తున్నట్టా? లేదు. ఏమంటే, చరిత్ర సాధారణాభివృద్ధిలో, భౌతిక విషయాలు భావాలను, సామాజిక ఉనికి, సామాజిక చైతన్యాన్ని నిర్ణయిస్తాయని ఒప్పుకుంటూనే మనం, భావాల ప్రభావం భౌతిక విషయాలమీదా, సామాజిక చైతన్య ప్రభావం సామాజిక ఉనికిమీదా, ఉపరితల నిర్మాణ ప్రభావం ఆర్థిక పునాదిమీదా వుంటుందని కూడా ఒప్పుకోవాలి; ఒప్పుకొని తీరాలి. ఇది భౌతిక వాదానికి విరుద్ధం కాకపోగా అందుకు మారుగా యాంత్రిక భౌతికవాదాన్ని పక్కకునెట్టి, గతితార్కిక భౌతికవాదాన్ని దృఢంగా బలపరుస్తుంది.

వైరుధ్యం యొక్క విశిష్టతను అధ్యయనం చేసేటపుడు ఒక ప్రక్రియలోని ప్రధాన, అప్రధాన వైరుధ్యాలు, వైరుధ్యంలోని ప్రధాన, అప్రధాన అంశాలు, అనే రెండు కోణాలనూ పరిశీలించకపోతే, అంటే వైరుధ్యంలోని ఈ రెండు కోణాల



ప్రత్యేక స్వభావాన్ని పరిశీలించకపోతే, మనం అయోమయంలో కూరుకొని పోయి, వైరుధ్యాన్ని నిర్దుష్టంగా అర్థం చేసుకోలేక, పర్యవసానంగా దాన్ని పరిష్కరించ దానికి సరైన పద్ధతిని కనుగొన లేకపోతాం. వైరుధ్యం యొక్క ఈ రెండు కోణాల ప్రత్యేక స్వభావం లేదా ప్రత్యేకత, విరుద్ధంగా వున్న శక్తుల అసమత్వాన్ని సూచిస్తుంది. ప్రపంచంలో ఏదీ ఖరాఖండీగా సమంగా పెరగదు. సమాజాభివృద్ధి సిద్ధాంతాన్ని, సమతుల్య సిద్ధాంతాన్ని మనం తప్పక వ్యతిరేకించాలి. అంతేకాదు, వైరుధ్యం యొక్క ఈ నిర్దిష్ట లక్షణాలు, వైరుధ్యాభివృద్ధి క్రమంలో, దాని ప్రధాన, అప్రధాన అంశాలలోని మార్పులే, కొత్తది పాతదాని స్థానాన్ని ఆక్రమించడంలోని శక్తిని వ్యక్తపరుస్తాయి. వైరుధ్యంలోని అసమానత యొక్క వివిధ స్థితుల గురించిన, ప్రధాన, అప్రధాన వైరుధ్యాల గురించిన, వైరుధ్యం యొక్క ప్రధాన అప్రధాన అంశాల గురించిన, అధ్యయనం-ఇది ఒక విప్లవ పార్టీ, రాజకీయ, సైనిక రంగాలలో తన వ్యూహం, ఎత్తుగడల విధానాలను సరిగ్గా నిర్ణయించుకునే, అత్యావశ్యకమైన పద్ధతి. కమ్యూనిస్టులందరూ దానిపై తప్పక శ్రద్ధ పెట్టాలి.

## 5. వైరుధ్యంలోని అంశాల ఐక్యత (identity), ఘర్షణ

వైరుధ్యపు విశ్వజనీనతనూ, ప్రత్యేకతనూ మనం అర్థంచేసుకున్నమీదట, వైరుధ్యంలోని ఉభయాంశాల ఐక్యత (identity) ఘర్షణల సమస్య అధ్యయనాని కుపక్రమించాలి.

సారూప్యత, ఐక్యత, సంయోగం (coincidence), పరస్పర వ్యాపకం, పరస్పర ప్రవేశం, పరస్పరావలంబనం (లేక పరస్పరాధారంతో మనుగడ) పరస్పర సంబంధం, లేదా పరస్పర సహకారం - ఈ వేరువేరు పదాలన్నిటికీ అర్థం ఒకటే. అవి ఈ క్రింది రెండు అంశాలను సూచిస్తాయి: ఒక వస్తువు యొక్క అభివృద్ధి క్రమంలో వైరుధ్యం యొక్క ఉభయ అంశాలలో ఒకటి వుంటే, రెండోది వున్నట్టే, దానికిదే ముందు షరతు, రెండు అంశాలు ఒకే ఒక 'ఎంటిటీ'లో సహనివాసం చేస్తాయి. పరిస్థితులనుబట్టి, విరుద్ధాంశాలు రెండూ ఒకటి యింకో దానిగా రూపాంతరం చెందుతాయి. ఐక్యత (identity) అంటే అర్థం యిదే.

లెనిన్ యిలా అన్నారు:

"విరుద్ధాంశాలు ఐక్యం (identical) గా ఎలా వుండగలవో, అది ఎలా జరిగిందో (ఎలా జరుగుతుందో) - ఏ పరిస్థితుల్లో అవి, ఒకటి ఇంకోదానిగా

రూపాంతరం చెందుతూ, ఐక్యం (identical) గా వుంటాయో - మానవ మేధస్సు, ఈ విరుద్ధాంశాలను ఎందుకై, నిర్జీవమైన, ఎదుగుబొదుగు వుండని (rigid) వాటిగా తీసుకోకుండా, వాటిని సజీవమైన, నియతమైన, చలనయుతమైన, పరస్పరం రూపాంతరం చెందేవాటిగా తీసుకోవాలో వివరించి బోధించేది "గతితర్కం"[16].

ఈ మాటలకు అర్థం ఏమిటి ?

ప్రతీ ప్రక్రియలోని విరుద్ధాంశాలూ, ఒకదాన్ని మరొకటి నిరాకరిస్తాయి. పరస్పరం ఘర్షిస్తాయి, పరస్పర వ్యతిరేకాలుగా వుంటాయి. ఏ మినహాయింపులూ లేకుండా, అవి అన్ని వస్తువుల అభివృద్ధి ప్రక్రియల్లోనూ, మానవుల ఆలోచనలన్నిటిలోనూ వుంటాయి. ఒక సామాన్య ప్రక్రియలో ఒక జత విరుద్ధాంశాలే వుంటాయి: కాగా, ఒక సంక్లిష్ట ప్రక్రియలో ఎక్కువ వుంటాయి. ఈ విరుద్ధాంశాల జతలు పరస్పర వైరుధ్యంతో వుంటాయి. భౌతిక ప్రపంచంలోని అన్ని వస్తువులు, మానవుల అన్ని భావాలు ఈ విధంగానే ఏర్పడి, చలనం పొందుతాయి.

విషయం ఇలా వుంటే, ఇక సారూప్యత (iedntity) లేదా ఐక్యతకు అవకాశమే లేదు ? ఇక అపుడు సారూప్యత గురించీ ఐక్యత గురించీ ఎలా చెప్పగలం ?

వాస్తవం ఏమంటే, ఏ విరుద్ధాంశమైనా ఏకాంతం (isolation)లో వుండ లేదు. దాని విరుద్ధాంశం లేకపోతే, దాని ఉనికికే అవకాశం వుండదు. కొంచెం ఆలోచించండి, ఏ ఒక వస్తువు యొక్క విరుద్ధాంశంగానీ, మానవుడి మెదడులోని భావనగానీ స్వతంత్రంగా ఉనికిలో వుండగలదా ? ప్రాణం లేకపోతే చావు లేదు. చావు లేకపోతే ప్రాణం వుండదు. 'పైన' లేకపోతే 'కింద' వుండదు, 'కింద' లేకుండా పైన వుండదు. దురదృష్టం లేనిదే అదృష్టం వుండదు, అదృష్టం లేనిదే దురదృష్టం వుండదు. సౌకర్యం లేనిదే అసౌకర్యం వుండదు, అసౌకర్యం లేకుండా సౌకర్యం వుండదు. భూస్వాములు లేకపోతే కౌలుదార్లుండరు, కౌలుదార్లు లేకపోతే భూస్వాములుండరు. బూర్జువాలు లేకపోతే కార్మికవర్గం వుండదు, కార్మికవర్గం లేకపోతే బూర్జువాలుండరు. దేశాలపై సామ్రాజ్యవాద పీడన లేకపోతే వలసలు, అర్ధవలసలు ఉండవు, వలసలు, అర్ధవలసలు లేకపోతే సామ్రాజ్యవాద పీడనా వుండదు. విరుద్ధాంశాలన్నిటి విషయం ఇంతే. కొన్ని పరిస్థితుల్లో అవి, ఒకవంక, పరస్పరం వ్యతిరేకిస్తాయి, మరొకపక్క పరస్పరం సంబంధం కలిగి వుండి, పరస్పరం ప్రవేశిస్తాయి, పరస్పరం వ్యాపిస్తాయి, పరస్పరం ఆధారపడి



వుంటాయి, ఈ లక్షణాన్నే ఐక్యత (identity) అని అంటారు. కొన్ని పరిస్థితులలో విరుద్ధాంశాలన్నింటికి ఐక్యత లేని (non - identity) స్వభావం వుంటుంది, అందువల్లనే వైరుధ్యంలో వున్నాయని అంటాం. అయితే వాటికి ఐక్యతాగుణం కూడా వుంది కాబట్టి, వాటికి పరస్పర సంబంధం వుంటుంది. "విరుద్ధాంశాలు ఎలా ఐక్యంగా (identical) వుండగలవో" అనేదాన్ని గతితర్కం అధ్యయనం చేస్తుంది, అని లెనిన్ అన్న మాటలకు అర్థం యిదే. అవి ఐక్యంగా (identical) ఎలా వుండగలవు ? ఒకటి వుంటేనేగానీ రెండోది వుండలేదు కనుక. ఐక్యతకు (identity) మొదటి అర్థం యిదే.

అయితే, విరుద్ధాంశాలు, ఒకటి ఉంటే రెండోది వుండదనీ, వాటిమధ్య ఐక్యత వుందనీ, తద్ పర్యవసానంగా అవి ఒక 'ఎంటిటి'లో సహజీవనం చేయగలవనీ, అన్నంతమాత్రాన సరిపోయిందా ? సరిపోదు. అవి తమ ఉనికిని ఒకదానిమీద మరొకటి ఆధారపడి వుండటం తోనే విషయం ముగియదు. అంతకన్నా ముఖ్యమైన దేమంటే, అవి పరస్పరం రూపాంతరం చెందడం, అంటే కొన్ని పరిస్థితులలో, ఒక వస్తువులోని రెండు విరుద్ధాంశాలు, దేనికది, తన వ్యతిరేకాంశంగా రూపాంతరం చెందుతుంది. తన వ్యతిరేకాంశం స్థానంలోకి మారుతుంది. వైరుధ్యము యొక్క ఐక్యతకు (idetity) యిది రెండవ అర్థం.

ఇక్కడ కూడా ఐక్యత (identity) ఎందుకుంది ? చూడండి, ఒకప్పుడు పాలితులుగా వున్న శ్రామికవర్గం, విప్లవం ద్వారా, పాలకుడిగా రూపాంతరం చెందుతుంది. అదే సమయంలో మాజీ పాలకులైన బూర్జువావర్గం పాలితులుగా రూపాంతరం చెంది, తన వ్యతిరేకాంశం వున్న స్థానంలోకి మారుతుంది. ఇది సోవియట్ యూనియన్‌లో ఇప్పటికే జరిగింది. ప్రపంచ మంతటా జరుగబోతుంది కూడా. కొన్ని పరిస్థితులలో విరుద్ధాంశాల మధ్య పరస్పర సంబంధమూ, ఐక్యతా లేకపోతే, అటువంటి మార్పు ఎలా జరుగుతుంది ?

ఆధునిక చైనా చరిత్రలో, ఒక దశలో అభ్యుదయకర పాత్రను నిర్వహించిన కొమింటాంగ్, తన స్వభావసిద్ధమైన వర్గతత్వంవల్లా, సామ్రాజ్యవాదం ఎగదోయడం వల్లా (ఇవి పరిస్థితులు) 1927 తర్వాత విప్లవ ప్రతిఘాతక పార్టీ అయింది: చైనా జపానుల మధ్య వైరుధ్యం మరింత పదునెక్కడం వల్లా, కమ్యూనిస్టు పార్టీ యొక్క

ఐక్యసంఘటనా విధానంవల్లా (ఇవి పరిస్థితులు) కొమింటాంగ్‌కు, జపానును ప్రతిఘ టించడానికి తప్పనిసరై ఒప్పుకోవల్సి వచ్చింది. వైరుధ్యంలోని అంశాలు, పరస్పరం మారతాయి, ఇందులోనే ఖచ్చితమైన ఐక్యత (identity) వుంది.

మన వ్యవసాయ విప్లవం, భూములపై యాజమాన్యం గల భూస్వామ్యవర్గం, తమ భూముల్ని కోల్పోయిన వర్గంగా రూపాంతరం చెందిన, అదే సమయంలో, ఒకప్పుడు తమ భూముల్ని కోల్పోయిన రైతులు, చిన్న చిన్న కమతాలను సంపా దించుకున్న వారిగా రూపాంతరం చెందిన, ఒక క్రమం. అదే ప్రక్రియ మళ్ళీ జరగ బోతోంది. కొన్ని పరిస్థితులలో కలిగివుండడానికీ లేకపోవడానికీ, సంపాదించుకోవ డానికీ పోగొట్టుకోవడానికీ, పరస్పర సంబంధం వుంటుంది. ఈ రెండు పక్షాల మధ్యా ఐక్యత (identity) వుంది. సోషలిస్టు సమాజంలో రైతుల ప్రైవేటు యాజమాన్యం, సోషలిస్టు వ్యవసాయం కింది ప్రజా యాజమాన్యంగా రూపాంతరం చెందుతుంది. సోవియట్ యూనియన్‌లో ఇది ఈ వరకే జరిగింది: అన్నిచోట్లా జరగబోతోంది. ప్రైవేటు ఆస్తినుండి ప్రజల ఆస్తికి దారితీసే ఒక వారధి వుంది, తత్వశాస్త్రంలో దాన్ని ఐక్యత (identity) లేదా పరస్పర రూపాంతరీకరణ లేదా పరస్పర ప్రవేశం అంటారు.

శ్రామికవర్గ నియంతృత్వాన్ని గానీ, ప్రజల నియంతృత్వాన్ని గానీ పటిష్ఠ పరచుకోవడమంటే, వాస్తవానికి, ఈ నియంతృత్వాన్ని రద్దుచేసే, అన్ని రాజ్యాంగ వ్యవస్థలు రద్దుఅయ్యే, ఉన్నతదశకు పురోగమించడానికి అనువైన పరిస్థితులను కల్పించడమే. కమ్యూనిస్టు పార్టీని నెలకొల్పి నిర్మించడం అంటే వాస్తవానికి కమ్యూనిస్టు పార్టీని, సకల రాజకీయ పార్టీలను నిర్మూలించడానికి అనువైన పరిస్థితు లను కల్పించుకోడానికే. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో విప్లవ సైన్యాన్ని నిర్మించి, విప్లవ యుద్ధాన్ని సాగించడం, వాస్తవానికి, యుద్ధాన్ని శాశ్వతంగా నిర్మూ లించడానికి అనువైన పరిస్థితులను కల్పించుకోడమే. ఈ విరుద్ధాంశాలు అదే సమయంలో పరస్పరం పరిపుష్టిని చేకూర్చుకుంటాయి.

యుద్ధమూ శాంతి, ఒకటి యింకోదానిగా రూపాంతరం చెందుతాయని అందరికీ తెల్సు. యుద్ధం, శాంతిగా రూపాంతరం చెందుతుంది. ఉదాహరణకు, మొదటి ప్రపంచయుద్ధం, యుద్ధానంతరం శాంతిగా రూపాంతరం చెందింది, చైనా



లోని అంతర్యుద్ధం యిపుడు నిలిచిపోయింది. అంతరంగిక శాంతికి తావిచ్చింది. శాంతి, యుద్ధంగా రూపాంతరం చెందుతుంది. ఉదాహరణకు, కొమింటాంగ్-కమ్యూనిస్టు సహకారం 1927లో యుద్ధంగా రూపాంతరం చెందింది, నేటి ప్రపంచ శాంతి, రెండవ ప్రపంచ యుద్ధంగా రూపాంతరం చెందవచ్చు. ఇలా ఎందుకు జరుగుతోంది? ఎందుకంటే వర్గ సమాజంలో, యుద్ధమూ శాంతి వంటి విరుద్ధ విషయాలకు కొన్ని పరిస్థితులలో ఐక్యత (identity) వుంటుంది.

విరుద్ధ విషయాలన్నీ పరస్పర సంబంధం కలిగి వున్నాయి. కొన్ని పరిస్థితు లలో అవి ఒకేఒక 'ఎంటిటి' లో సహజీవనం చెయ్యడం మాత్రమేకాక, మరికొన్ని పరిస్థితులలో అవి పరస్పరం రూపాంతరం చెందుతాయి. విరుద్ధాంశాల ఐక్యతకు (identity) పూర్తి అర్థం ఇదే. "అవి ఐక్యంగా (identical) వుండడం ఎలా జరిగింది? (ఎలా జరుగుతుంది) ఏ పరిస్థితుల్లో అవి పరస్పరం రూపాంతరం చెందుతూ, ఐక్యంగా (identical) వుంటాయి" అన్న లెనిన్ మాటలకు అర్థం ఇదే.

"మానవ మేధస్సు, ఈ విరుద్ధాంశాలను, నిర్జీవమైన, ఎదుగు బొదుగులేని వాటిగా పరిగణించకూడదు. వాటిని, సజీవమైన, నియతమైన, చలనయుతమైన, పరస్పరం రూపాంతరం చెందేవాటిగా తీసుకోవాలి" అనడం ఎందుకు? ఎందుకంటే భౌతిక వాస్తవికత అలానే వుంది గనుక. వాస్తవానికి భౌతిక వస్తువులలోని విరుద్ధాం శాల ఐక్యత లేదా సారూప్యత (identity) నిర్జీవమైనదిగానీ, ఎదుగూ బొదుగూ లేనిదిగానీ కాదు. అది సజీవమైనది, నియతమూ, చలనయుతము, తాత్కాలికమూ, సాపేక్షమూ అయినది. కొన్ని పరిస్థితులలో, ప్రతి విరుద్ధాంశమూ తన వ్యతిరే కాంశంగా రూపాంతరం చెందుతుంది. ఇది మానవుని ఆలోచనలో ప్రతిఫలించి నపుడు, భౌతిక గతితార్కిక మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం అవుతుంది. గత, వర్తమానాల, అభివృద్ధి నిరోధక పాలకవర్గాలు, వారికి ఊడిగంచేసే అధిభౌతిక వాదులు మాత్రమే, విరుద్ధాంశాలను సజీవమైనవి, నియతమైనవి, చలనయుతమైనవి, పరస్పర పరివర్తన పొందగలవిగా పరిగణించక, వాటిని నిర్జీవమైన, ఎదుగూబొదుగు లేని వాటిగా పరిగణిస్తారు. ప్రజలను మభ్యపెట్టి, తమ ఏలుబడిని శాశ్వతంగా కొన సాగించుకోడానికి, ఈ భ్రాంతిని సర్వత్రా ప్రచారం చేస్తారు. అభివృద్ధి నిరోధకులు,

అధిభౌతికవాదుల ఈ భ్రాంతుల్ని బట్టబయలు చేయడం, వస్తువులలో స్వతస్సిద్ధంగా వుండే గతితర్కాన్ని ప్రచారం చేయడం, ఆ విధంగా వస్తువుల రూపాంతరీకరణను శీఘ్రతరం చేసి, విప్లవ లక్ష్యాన్ని సాధించడం కమ్యూనిస్టుల కర్తవ్యం.

కొన్ని పరిస్థితులలో విరుద్ధాంశాల ఐక్యతను (identity) గురించి చెప్పుకునేటపుడు, మనం మాట్లాడుకునేది, వాస్తవమైన, నిర్దిష్టమైన విరుద్ధాంశాల గురించీ, వాస్తవమైన, నిర్దిష్టమైన, విరుద్ధాంశాల పరస్పర రూపాంతరీకరణల గురించీనూ. పురాణాల్లో అసంఖ్యాకమైన రూపాంతరీకరణలున్నాయి. ఉదాహరణకు "షాన్-హై చింగ్"[17]లో కువాపు, సూర్యుడితో పరుగుపందెం వేస్తాడు. "హ్వాయ్ నాన్ ట్జు"[18]లో 'యీ' తొమ్మిది సూర్యుళ్ళను (బాణాలతో) పడగొడతాడు. "సియిచి"[19]లో కోతిరాజు డెబ్బైరెండు రూపాలు మార్చుతాడు. "లియావో చై వింత గాథలు"[20]లో దయ్యాలు, గుంటనక్కలు, మానవ రూపాలు ధరించే సంఘటనలు అనేకం వున్నాయి. అయితే ఈ కట్టుకథల్లోని విరుద్ధాంశాల మార్పులు నిజమైనవికావు. నిజమైన పరిస్థితులను సూచించేవీకావు. అవి విరుద్ధాంశాల అసంఖ్యాకమైన, వాస్తవ సంక్లిష్ట పరస్పర రూపాంతరీకరణలను అమాయకంగా వూహించి కల్పించినవి. "పౌరాణిక రచన యావత్తు ప్రకృతి శక్తులను ఊహల ద్వారా లోబరచుకొని శాసిస్తుంది. ఆ కారణంచేత మానవుడు ప్రకృతి శక్తులను వశపర్చుకోగానే అది అంతరించిపోతుంది."[21] అని మార్క్స్ చెప్పారు. పురాణాలలో (పిల్లల కథలలో కూడా) వుండే లక్షలాది రూపాంతరీకరణలు ప్రజలను ఎందుకు ఆనందపరుస్తాయంటే, అవి ప్రకృతి శక్తులమీద మానవుని విజయం గురించి కల్పనాత్మకంగా చిత్రిస్తాయి, ఉత్తమ పురాణాలలో "శాశ్వత రమణీయత" వుంటుందని మార్క్స్ అన్నారు. అయితే పురాణగాథలు, కొన్ని పరిస్థితుల్లో వుండే నిర్దిష్ట వైరుధ్యాల ఆధారంమీద కల్పన చేసినవికావు. అందుచేత అవి వాస్తవాన్ని శాస్త్రీయంగా చిత్రించవు. అనగా పురాణాలలోనూ, పిల్లల కథల్లోనూ వైరుధ్యాన్ని ఏర్పరచే అంశాలకు కేవలం ఊహాజనితమైన ఐక్యత (identity) వుందేతప్ప, నిర్దిష్టమైన ఐక్యత (identity) లేదు. వాస్తవ రూపాంతరీకరణల్లోని ఐక్యత (identity) ని శాస్త్రీయంగా చిత్రించేది మార్క్సిస్టు గతితర్కం.



గుడ్డు కోడిపిల్లగా మారుతుంది కానీ రాయి మారదు. ఎందుచేత? యుద్ధానికీ శాంతికీ ఐక్యత (identity) వుందిగానీ, యుద్ధానికీ రాతికీ మధ్య ఏ ఐక్యతాలేదు, ఎందుచేత? మనుషులకు మనుషులే పుడతారు గానీ మరేదో పుట్టదు ఎందుచేత? దీనికి గల ఒక కారణం ఏమిటంటే, విరుద్ధాంశాల ఐక్యత (identity), అందుకు ఆవశ్యకమైన కొన్ని పరిస్థితులలోనే వుంటుంది. ఈ అవసరమైన కొన్ని పరిస్థితులు లేనప్పుడు ఐక్యత (identity) అనేదే వుండదు.

1917లో రష్యాలో, బూర్జువా ప్రజాస్వామ్య ఫిబ్రవరి విప్లవం, శ్రామికవర్గ సోషలిస్టు అక్టోబరు విప్లవంతో నేరుగా ముడిపడి వుండగా, ఫ్రాన్సులో, బూర్జువా విప్లవం, సోషలిస్టు విప్లవంతో నేరుగా ముడిపడిలేదు. 1871 నాటి పారిస్ కమ్యూన్ విఫలమైంది, ఎందుచేత? మరోవైపున మంగోలియా, మధ్యఆశియాలలో గల సంచార జీవిత వ్యవస్థ సోషలిజంతో నేరుగా ముడిపడి వుండటానికి కారణం ఏమిటి? చైనా విప్లవం, పెట్టుబడిదారీ భవిష్యత్తును తప్పించుకొని పాశ్చాత్య దేశాలనుసరించిన పాత చారిత్రిక మార్గాన్ననుసరించకుండానే, బూర్జువా నియంతృత్వ దశకు లోనుగాకుండానే, సూటిగానే సోషలిజంతో సంధానం పెట్టుకోగల్గడానికి కారణం ఏమిటి? ఏకైక కారణం ఏమంటే, ఆయా కాలాల్లోని నిర్దిష్ట పరిస్థితులు. కొన్ని అవసరమైన పరిస్థితులంటే వస్తువుల అభివృద్ధి ప్రక్రియలో, కొన్ని వైరుధ్యాలు ఉత్పన్నమవుతాయి, అంతేగాక, వాటి లోపలవున్న విరుద్ధాంశాలు పరస్పరాధారం గలవై, పరస్పరం రూపాంతరం చెందుతాయి. అలా కానపుడు ఇదేదీ సాధ్యంకాదు.

ఐక్యతా (identity) సమస్య ఇలాంటిది. ఇక ఘర్షణ అంటే ఏమిటి? ఐక్యతకు ఘర్షణకు గల సంబంధం ఏమిటి?

లెనిన్ యిలా అన్నారు:

"విరుద్ధాంశాల ఐక్యత (సంయోగం, సారూప్యత, సమక్రియ) నియతమైనది, తాత్కాలికమైనది, సాపేక్షికమైనది. పరస్పరం నిరాకరించుకునే విరుద్ధాంశాల మధ్య ఘర్షణ, అభివృద్ధి, చలనాలు ఎంత నిత్యమైనవో అంత నిత్యమైనది."[22]

ఈ మాటలకు అర్థం ఏమిటి?

అన్ని ప్రక్రియలకు ఒక మొదలు, ఒక చివరా వుంటుంది. అన్ని ప్రక్రియలు తమ విరుద్ధాంశాలలోకి రూపాంతరం చెందుతాయి. ప్రక్రియల స్థిరత్వం (constancy) సాపేక్షమైనది. కానీ, ఒక ప్రక్రియ మరో ప్రక్రియగా రూపాంతరం చెందడంలో వ్యక్తమయ్యే పరిణామశీలత (mutability) నిత్యమైనది.

అన్ని వస్తువులలోనూ రెండు చలన స్థితులుంటాయి. సాపేక్షకమైన విరామం (rest), విస్పష్టమైన మార్పు, వస్తువులలోనే వున్న రెండు విరుద్ధాంశాల మధ్య ఘర్షణ, ఈ రెంటికీ కారణభూతమవుతుంది. వస్తువు తొలి చలన దశలో ఉన్నప్పుడు, అది పరిమాణాత్మకంగా మారుతుందేగానీ, గుణాత్మకంగా కాదు. అందుచేత అది విరామంలో వున్నట్టుగా కనిపిస్తుంది. అది, రెండవ చలన స్థితిలో వున్నపుడు, మొదటి స్థితిలోని, పరిమాణాత్మక మార్పు పరాకాష్టకు చేరుకునే వుండి, వస్తువు ఒక 'ఎంటిటి'గా వుండటానికే వినాశం ఏర్పడడానికి దారితీస్తుంది: గుణాత్మకమైన మార్పే జరుగుతుంది. అందుచేత, నిష్పష్టమైన మార్పు కనబడుతుంది. మనం నిత్య జీవితంలో గమనించే ఐక్యత, సమైక్యత, సంయోగమూ, బౌంధిక, తుల్యత, ప్రతిష్టంభన, విరామం, స్థిరత, సమతులనం, దృఢత్వం, ఆకర్షణా వగైరాలన్నీ, పరిమాణాత్మక మార్పు స్థితిలో వస్తువుల స్వరూపాలు. మరోవైపున ఐక్యత, భగ్నంకావడం, అంటే ఈ సమైక్యత, సంయోగం, బౌందిక, తుల్యత, ప్రతిష్టంభన, విరామం, స్థిరత, సమతుల్యం, దృఢత్వం, ఆకర్షణల విచ్ఛిత్తి, వాటిలో ప్రతిఒక్కటి దాని వ్యతిరేకాంశంగా రూపాంతరం చెందడం, యివన్నీ గుణాత్మక స్థితిలోని వస్తువుల స్వరూపాలు. ఒక ప్రక్రియ మరో ప్రక్రియగా రూపాంతరం చెందడం. వస్తువులు నిరంతరమూ, మొదటి చలన స్థితినుండి, రెండవ చలన స్థితిలోకి తమని రూపాంతరీకరించుకుంటూ వుంటాయి. రెండు స్థితులలోనూ విరుద్ధాంశాల మధ్య ఘర్షణ జరుగుతూనే వుంటుంది. అయితే, రెండవ స్థితిద్వారా వైరుధ్యం పరిష్కృతమవుతుంది. అందువల్లనే మనం విరుద్ధాంశాల ఐక్యత, నియతమనీ, తాత్కాలికమనీ, సాపేక్షమనీ, కాగా, పరస్పరం నిరాకరించుకునే విరుద్ధాంశాల ఘర్షణ నిత్యమైనదని అంటాం.

ఇంతకు ముందు మనం రెండు విరుద్ధాంశాలు ఒక 'ఎంటిటి'లో సహనివాసం



చేయగలవనీ, వాటిమధ్య ఐక్యత (identity) వుందికాబట్టి, అవి పరస్పరం రూపాంతరం చెందగలవనీ అన్నపుడు, మనం పరిస్థితులను దృష్టిలో వుంచుకునే ఆ మాట అన్నాం. అంటే, కొన్ని పరిస్థితులలో రెండు విరుద్ధాంశాలు సమైక్యపర్చబడగలవు, పరస్పరం రూపాంతరం చెందగలవు. కానీ ఈ పరిస్థితులు లేకపోతే అవి వైరుధ్యాన్ని ఏర్పరచలేవు. ఒకే 'ఎంటిటి'లో సహనివాసం చేయలేవు. విరుద్ధాంశాల ఐక్యత (identity) కేవలం కొన్ని పరిస్థితులలోనే సాధ్యమవుతుంది కనుకనే మనం ఐక్యత (identity) నియతమైనది, సాపేక్షమైనది అని అన్నాం. విరుద్ధాంశాల మధ్య ఘర్షణ ఒక ప్రక్రియలో ఆరంభం నుంచి చివరివాకా ఆవరించి వుంటుందని, ఒక ప్రక్రియను మరో ప్రక్రియగా రూపాంతరం చెందిస్తుందనీ, అది సర్వగత (ubiquitons) మనీ, అందుచేత ఘర్షణ, నియమరహితమైనదనీ నిత్యమైనదనీ కూడా మనం అదనంగా చెప్పాలి.

నియతమూ, సాపేక్షమూ అయిన ఐక్యత (identity) నియమరహితమూ, నిత్యమూ అయిన ఘర్షణల సంయోగం, అన్ని వస్తువులలోని విరుద్ధాంశాల గమనాలనూ ఏర్పరుస్తాయి.

"పరస్పరం విరోధించే వస్తువులు, పరస్పరం పరిపుష్టిని కూడా చేకూర్చుకుంటాయి" అని చైనా వాళ్ళం తరచుగా అంటుంటాం.[23] అంటే, పరస్పరం విరోధించే వస్తువులకు ఐక్యత (identity) కూడా వుంటుందన్న మాట. ఇది గతితార్కికమైన నానుడి, అధిభౌతిక వాదానికి వ్యతిరేకమైనది. "పరస్పరం విరోధించడం" అనేది ఈ రెండు విరుద్ధాంశాల మధ్య పరస్పర నిరాకరణను, ఘర్షణనూ సూచిస్తుంది. "పరస్పరం పరిపుష్టిని చేకూర్చుకుంటాయి" అంటే కొన్ని పరిస్థితుల్లో రెండు విరుద్ధాంశాలు ఐక్యపడి సారూప్యతను సాధిస్తాయి అని, అయినాగానీ ఐక్యత (identity)లోనే ఘర్షణ వుంది. ఘర్షణ లేకుండా ఐక్యత (identity) ఉండనే వుండదు.

ఐక్యత (identity)లో ఘర్షణ వుంది. ప్రత్యేకతలో విశ్వజనీనత వుంది. వ్యక్తిత్వం (individuality)లో సార్వజనీనత వుంది. లెనిన్‌ను ఉటంకించి చెప్పాలంటే "సాపేక్షతలో ఒక నిత్యత వుంది."[24]

## 6. వైరుధ్యంలో వైషమ్య స్థానం.

విరుద్ధాంశాల ఘర్షణ సమస్యలో, వైషమ్యమంటే ఏమిటి అనే సమస్య కూడా వుంది. విరుద్ధాంశాల మధ్య ఘర్షణ రూపాల్లో, వైషమ్యం ఒకటి. అయితే, అది ఏకైక ఘర్షణారూపం కాదు.

మానవ చరిత్రలో, వర్గాల మధ్య వైషమ్యం, విరుద్ధాంశాల ఘర్షణ తాలూకు ఒక ప్రత్యేక వ్యక్తీకరణగా అస్తిత్వంలో వుంది. దోపిడీ వర్గాలకు, దోచుకో బడుతున్న వర్గాలకు మధ్య వైరుధ్యాన్నే తీసుకోండి. అటువంటి విరుద్ధ వర్గాలు ఒక సమాజంలో, బానిస సమాజం కానివ్వండి, భూస్వామ్య సమాజం కానివ్వండి, పెట్టుబడిదారీ సమాజం కానివ్వండి, దీర్ఘ కాలం సహజీవనం చేస్తాయి. కానీ, రెండు వర్గాల మధ్య వైరుధ్యం ఒక దశకు అభివృద్ధి చెందినపుడు బహిరంగ వైషమ్య రూపం తీసుకొని, విప్లవంగా పరిణమించింది. వర్గసమాజంలో, శాంతి యుద్ధంగా రూపాంతరం చెందే విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది.

బాంబు పేలేదాకా, అది కొన్ని పరిస్థితులలో సహజీవనం చేస్తున్న విరుద్ధాంశాలు వున్న ఒకే ఒక 'ఎంటిటి', ఒక కొత్త పరిస్థితి, అంటుకోడం అనే పరిస్థితి వున్నప్పుడే బాంబు పేలుతుంది. ప్రకృతిలో పాత వైరుధ్యాలను పరిష్కరించుకొని, కొత్త వైరుధ్యాలను ఏర్పరచుకోడానికి, అంతిమంగా బహిరంగ ఘర్షణరూపం తీసుకునే విషయాలన్నిటిలోనూ ఇటువంటి పరిస్థితి ఉత్పన్నమవుతుంది.

ఈ వాస్తవాన్ని అవగాహన చేసుకోడం చాలా ముఖ్యం. వర్గసమాజంలో, విప్లవాలు, విప్లవ యుద్ధాలు అనివార్యమనీ, అవి లేకపోతే, సామాజికాభివృద్ధిలో ముందడుగు వేయటమూ, అభివృద్ధి నిరోధక పాలక వర్గాలను కూలదోయడమూ, అసంభవమౌతుందనీ, అందుచేత ప్రజలు రాజకీయాధికారం గెల్చుకోడం అసాధ్యమవుతుందనీ అర్థం చేసుకోడానికి అది తోడ్పడుతుంది. సామాజిక విప్లవం అనవసరమనీ, అసాధ్యమనీ అభివృద్ధి నిరోధకులు చేసే మోసపు ప్రచారాన్ని కమ్యూనిస్టులు బట్టబయలు చెయ్యాలి. వారు మార్క్సిస్టు - లెనినిస్టు సామాజిక విప్లవ సిద్ధాంతాన్ని దృఢంగా బలపరచి, సామాజిక విప్లవం పూర్తిగా అవసరమే గాక, పూర్తిగా సాధ్యమనీ, యావత్ మానవ చరిత్రా, సోవియట్ యూనియనూ,



ఈ శాస్త్రీయ సత్యాన్ని ఋజువు చేశాయని ప్రజలు అర్థం చేసుకునేందుకు తోడ్పడాలి.

అయితే మనం విరుద్ధాంశాల, ప్రతి ప్రత్యేక ఘర్షణ తాలూకు పరిస్థితిని వాస్తవంగా అధ్యయనం చేయాలి. పైన చెప్పిన సూత్రాన్ని ప్రతిదానికి గుడ్డిగా అన్వయించకూడదు. వైరుధ్యాలు, ఘర్షణ, విశ్వజనీనమైనవీ, నిత్యమైనవీను. కానీ, వైరుధ్యాలను పరిష్కరించే పద్ధతులు అంటే పోరాట రూపాలు వైరుధ్యాల స్వభావంలోని తేడాలనుబట్టి మారతాయి. కొన్ని వైరుధ్యాలు స్పష్టమైన వైషమ్యాలుగా కనబడతాయి. మరికొన్ని కావు. వస్తువుల నిర్దిష్ట అభివృద్ధిని బట్టి కొన్ని తొలుత వైషమ్య రహితమైన వైరుధ్యాలు, వైషమ్య పూరితమైన వైరుధ్యాలుగా అభివృద్ధి చెందుతాయి. కాగా తొలుత వైషమ్య పూరితమైనవిగా ఉండిన మరికొన్ని, వైషమ్య రహితమైనవిగా అభివృద్ధి చెందుతాయి.

ముందే చెప్పినట్లు, వర్గాలు వున్నంత కాలమూ, కమ్యూనిస్టు పార్టీలో సరైన భావాలకూ, తప్పుడు భావాలకు మధ్య వైరుధ్యాలు, పార్టీ లోపల వర్గ వైరుధ్యాల తాలూకు ప్రతిబింబాలె. మొదట్లో కొన్ని సమస్యల విషయంలో, అటువంటి వైరుధ్యాలు వైషమ్యాలుగా వ్యక్తమవక పోవచ్చు. కానీ వర్గ పోరాటం అభివృద్ధి చెందే కొద్దీ అవి పెరిగి, వైషమ్యాలుగా అవవచ్చు. లెనిన్, స్టాలిన్‌ల సరైన ఆలోచనా ధోరణికీ ట్రాట్‌స్కీ, బుఖారిన్ వగైరాల తప్పుడు ఆలోచనా ధోరణికి మధ్య వైరుధ్యాలు, మొదట్లో వైషమ్య రూపంలో వ్యక్తమవలేదనీ, కానీ అటు తర్వాత అవి వైషమ్యాలుగా అభివృద్ధి చెందాయనీ, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ చరిత్ర మనకు తెలియచెప్తోంది. చైనా కమ్యూనిస్టు పార్టీలో కూడా అలాంటి సందర్భాలు వున్నాయి. మన పార్టీ కామ్రేడ్ల అనేకుల సరైన ఆలోచనాధోరణికీ, చెన్-టు-షి, చాంగ్-కువో-టావో, తదితరుల తప్పుడు ఆలోచనా ధోరణులకు మధ్య వైరుధ్యం, మొదట్లో వైషమ్య రూపంలో వ్యక్తమవలేదు. కానీ, అటు తర్వాత అవి వైషమ్యాలుగా అభివృద్ధి చెందాయి. ప్రస్తుతం మన పార్టీలో సరైన, తప్పుడు ఆలోచనా ధోరణులకు మధ్య వైరుధ్యం వైషమ్య రూపంలో వ్యక్తమవడం లేదు. తప్పులు చేసిన కామ్రేడ్స్ వాటిని సరిదిద్దుకోగల్గితే, అది వైషమ్యంగా

పరిణమించదు. అందుచేత పార్టీ తప్పని సరిగా ఒకవైపున తప్పుడు ఆలోచనా ధోరణికి వ్యతిరేకంగా తీవ్ర పోరాటాన్ని సల్పాలి, మరోవైపున, తప్పులు చేసిన కామ్రేడ్స్‌కు కనువిప్పు కల్గడానికి ఎంతైనా అవకాశం యివ్వాలి. పరిస్థితి యిలా వుండగా, మితిమీరిన పోరాటం అనుచితమన్నది స్పష్టమే. కానీ, తప్పులు చేసిన వారు వాటిని కొనసాగిస్తూ, వాటిని తీవ్రతరం చేస్తే, ఈ వైరుధ్యం వైషమ్యంగా మారే అవకాశం వుంది.

బూర్జువాల పరిపాలన కింద నగరాలు, గ్రామసీమలను క్రూరంగా దోపిడీ చేసే పెట్టుబడిదారీ సమాజంలోనూ విదేశీ సామ్రాజ్యవాదం, చైనీయ బడా దళారీ బూర్జువా వర్గాల పాలన కింద, నగరాలు గ్రామసీమలను కొల్లగొడుతున్న కొమింటాంగ్ ప్రాంతాలలోనూ, ఆర్థికంగా, నగరానికీ గ్రామానికీ మధ్య వైరుధ్యం అతి తీవ్రమైన వైషమ్యపూరితమైనదై వుంది. సోషలిస్టు దేశంలోనూ, మన విప్లవ స్థావర ప్రాంతాలలోనూ ఈ వైషమ్యపూరిత వైరుధ్యం, వైషమ్యరహిత వైరుధ్యంగా మారింది. కమ్యూనిస్టు సమాజం ఏర్పడిన పిమ్మట, అది రద్దుచేయ బడుతుంది.

"వైషమ్యమూ, వైరుధ్యమూ ఈ రెండూ వేరువేరు, అవి ఒకటికావు. సోషలిజంలో, మొదటిది అంతర్థానమవుతుంది; రెండవది వుండిపోతుంది."[25] అన్నారు లెనిన్. దానికి అర్థమేమంటే విరుద్ధాంశాల ఘర్షణ తాలూకు రూపాల్లో, వైషమ్యం ఒక రూపమే కానీ, దాని ఏకైకరూపం కాదు. వైషమ్య సూత్రీకరణను సర్వత్ర గుడ్డిగా అన్వయించరాదు.

## 7. ముగింపు

మనం మదింపుగా కొన్ని మాటలు చెప్పవచ్చు. వస్తువులలోని వైరుధ్య సూత్రం, అంటే విరుద్ధాంశాల ఐక్యతాసూత్రం ప్రకృతి, సమాజాల మౌలిక సూత్రం. అందుచేత అది ఆలోచనకు కూడా మౌలికమైన సూత్రమే. అది అధిభౌతికవాద ప్రాపంచిక దృక్పథానికి వ్యతిరేకమైనది. అది మానవ విజ్ఞాన



చరిత్రలో ఒక గొప్ప విప్లవానికి సంకేతం. గతితార్కిక భౌతికవాదం ప్రకారం, భౌతికంగా అస్తిత్వంలో వున్న వస్తువుల స్వీయ మానసిక ఆలోచనలకు చెందిన అన్ని ప్రక్రియల్లోనూ వైరుధ్యం వుంటుంది; ఈ ప్రక్రియ అన్నింటిలోనూ, మొదటి నుంచి చివరిదాకా ఆవరించి వుంటుంది. ఇదే వైరుధ్యం యొక్క విశ్వజనీనత, నిత్యత్వమూను. ప్రతి వైరుధ్యానికీ వైరుధ్యంలోని ఉభయ అంశాల్లో ప్రతిదానికీ, వాటివాటి ప్రత్యేక లక్షణాలుంటాయి. ఇది వైరుధ్యం యొక్క ప్రత్యేకత, సాపేక్షత్వమూను. కొన్ని పరిస్థితులలో విరుద్ధాంశాలకు ఐక్యత (identity) వుంటుంది. ఆ కారణంగా ఒకే ఒక 'ఎంటిటి'లో సహజీవనం చేయగలవు. పరస్పరం ఒకటి యింకోదానిగా రూపాంతరం చెందగలవు. ఇది కూడా వైరుధ్యం యొక్క ప్రత్యేకత, సాపేక్షతే. అయితే విరుద్ధాంశాల మధ్య ఘర్షణ ఎడతెగనిది. విరుద్ధాంశాలు సహనివాసం చేస్తున్నప్పుడు, పరస్పరం రూపాంతరం చెందుతున్నప్పుడూ కూడా అది కొనసాగుతూనే వుంటుంది. పరస్పరం రూపాంతరం చెందుతున్నపుడు యిది ప్రత్యేకించి కొట్టవచ్చినట్లు స్పష్టంగా కనబడుతుంది. ఇది మళ్ళీ వైరుధ్యం యొక్క విశ్వజనీనతా, నిత్యత్వమూనూ. వైరుధ్యం తాలూకు ప్రత్యేకతనూ సాపేక్షతనూ అధ్యయనం చేసేటపుడు, మనం తప్పనిసరిగా, ప్రధాన వైరుధ్యం, అప్రధాన వైరుధ్యాల మధ్యగల తేడా గురించీ, వైరుధ్యం యొక్క ప్రధాన అప్రధాన అంశాల మధ్యగల తేడా గురించి శ్రద్ధ వహించాలి. వైరుధ్యం యొక్క విశ్వజనీనతను వైరుధ్యంలోని విరుద్ధాంశాల ఘర్షణను అధ్యయనం చేసేటపుడు మనం తప్పనిసరిగా విభిన్న పోరాట రూపాల మధ్యనుండే తేడా గురించి శ్రద్ధ వహించాలి. లేకపోతే మనం తప్పులుచేస్తాం. అధ్యయనం ద్వారా మనం పైన చెప్పిన ముఖ్య విషయాలను గురించి వాస్తవ అవగాహనను పొందగల్గితే మనం మార్క్సిజం లెనినిజపు మూలసూత్రాలకు విరుద్ధమైనవైన, మన విప్లవాశయానికి హానికరమైనవైన పిడివాద భావాలను నిర్మూలించగలం, వాస్తవానుభవం వున్న మన కామ్రేడ్స్, తమ అనుభవాన్ని సూత్రాలుగా సంఘటితం చేసుకొని అనుభవవాద పొరపాట్లను తిరిగి చేయకుండా తప్పించుకోగలరు. వైరుధ్య సూత్రాన్ని గురించిన మన అధ్యయనం సారాంశం ఇదే.

## వివరణలు

1. వి. ఐ. లెనిన్, "తత్వశాస్త్ర చరిత్రపై హెగెల్ ఉపన్యాసాలు : సింహావలోకనం" కలక్టెడ్ వర్క్స్, రష్యన్ సం॥ మాస్కో, 1958, 38వ సంపుటి పే 249.

2. "గతితర్క సమస్య గురించి" అనే వ్యాసంలో లెనిన్ యిలా అన్నారు : "ఒకే మొత్తాన్ని రెండుగా విడగొట్టి దాని విరుద్ధ భాగాలను గుర్తించటం (హిరాక్లిటస్‌పై లాసెల్ పుస్తకంలో 3వ సెక్షన్ 'గుర్తింపు గురించి' ప్రారంభంలో హిరాక్లిటస్‌పై ఫిలో కొటేషన్ చూడండి) గతితార్కిక సూత్రం యొక్క సారాంశం ('సారభూతమైన వాటిలో' ఒకటి, ఏకైక ప్రధానమైనదికాకున్నా ప్రధానమైన వాటిలో స్వాభావిక గుణాలు, లక్షణాలలో ఒకటి)." (కలక్టెడ్ వర్క్స్, రష్యన్ సం॥ మాస్కో 1958, 38వ సంపుటి పే 357) "తత్వశాస్త్ర చరిత్రపై హెగెల్ ఉపన్యాసాలు : సింహావలోకనం" అనే రచనలో ఆయన "సంక్షిప్తంగా, గతితర్కాన్ని విరుద్ధాంశల మధ్య ఐక్యత సిద్ధాంతంగా నిర్వచించవచ్చును. ఇది గతితర్కంయొక్క మూలకందాన్ని గ్రహిస్తుంది, కాని దీనికి వివరణ, అభివృద్ధి అవసరం" అన్నారు. (అదే పుస్తకం పే 215).

3. వి. ఐ. లెనిన్ "గతితర్క సమస్య గురించి", కలక్టెడ్ వర్క్స్, రష్యన్ సం॥ మాస్కో 1958, 38వ సంపుటి, పే. 358.

4. హాన్ వంశపు రోజులలో కన్‌ఫ్యూసియనిజమ్ ప్రచారకులలో పేరు మోసిన టాంగ్-చుంగ్-సు (క్రీ. పూ. 179–104) సూక్తి.

5. ఫ్రెడరిక్ ఎంగెల్స్, "గతితర్కం, పరిమాణం గుణం," ఏంటీ డూరింగ్ ఇంగ్లీష సం॥ విదేశీ భాషా ప్రచురణాలయం మాస్కో 1959, పే. 166.

6. వి. ఐ. లెనిన్, "గతితర్క సమస్యను గురించి", కలక్టెడ్ వర్క్స్, రష్యన్ సం॥ మాస్కో 1958, 38వ సంపుటి, పే. 357-58.

7. ఫ్రెడరిక్ ఎంగెల్స్, ముందుచెప్పిన పుస్తకం, పే. 166-67.

8. వి. ఐ. లెనిన్, "గతితర్క సమస్యను గురించి", కలక్టెడ్ వర్క్స్, రష్యన్ సం॥ మాస్కో 1958, 38వ సంపుటి, పే. 357.



9. అదే పుస్తం, పే. 358-59.

10. చూడుడు : "చైనా విప్లవ యుద్ధంలో వ్యూహాత్మక సమస్యలు" వివరణ 10, ఇదే సంపుటి పేజీ 327.

11. అదే రచన వివరణ 2, పేజీ 322.

12. వీచెంగ్ (క్రీ. శ. 580-643) టాంగ్ వంశపు రాజనీతిజ్ఞుడు, చరిత్రకారుడు.

13. షిహూ-చువాన్ (ఊబినేలల వీరులు) నవల 14వ శతాబ్దపు ప్రసిద్ధ చైనా నవల. ఉత్తరదేశ సుంగ్ వంశపు చివరి రోజులలో రైతు యుద్ధాన్ని యిది వర్ణిస్తుంది. రైతుల తిరుగుబాటు నాయకుడు, నవలలో నాయకుడు అయిన సుంగ్ చియాంగ్ లియాంగ్‌షాన్‌పో పరిసరాలలోని చు గ్రామంలో తన స్థావరం ఏర్పరచుకున్నాడు. ఆ గ్రామపెద్ద అయిన చు-చావో-ఫెంగ్ ఒక నిరంకుశ భూస్వామి.

14. వి. ఐ. లెనిన్, "ట్రేడ్ యూనియన్లు, ప్రస్తుత పరిస్థితి, ట్రాట్స్కీ, బుఖారిన్‌ల పొరపాట్లను గురించి మరొకసారి", సెలక్టెడ్ వర్క్స్, ఆంగ్ల సం॥ ఇంటర్నేషనల్ పబ్లిషర్స్, న్యూయార్క్, 1943, 9 వ సంపుటి, పే. 69.

15. వి. ఐ. లెనిన్, "ఏం చేయాలి ?", కలక్టెడ్ వర్క్స్, ఆంగ్ల సం॥ మాస్కో, 1961, 5 వ సంపుటి, పే. 369.

16. వి. ఐ. లెనిన్ "హెగెల్ తర్కవిజ్ఞానం : సింహావలోకనం", కలక్టెడ్ వర్క్స్, రష్యన్ సం॥ మాస్కో, 1958, 38వ సంపుటి, పే. 97-98.

17. షాన్‌హైచింగ్ (పర్వతాలు, సముద్రాలు గ్రంథం) అనే పుస్తకం యుద్ధాల రాజ్యాల శకం (వారింగ్ స్టేట్స్ - క్రీ.పూ. 403-421)లో రాయబడింది. అందులోని క[illegible] ఒకదానిలో, కాఫూ అనే ఒక అతిలోక మానవుడు (దేవత) సూర్యుణ్ణి వెం[illegible]గిలి అధిగమించాడు. కాని దాహంవల్ల చనిపోయాడు. అతడి సైన్యం టెంగ్ అడవిగా మారిపోయారు.

18. 'ఈ' ప్రాచీన చైనాలో ధనుర్విద్యలో పేరుగాంచిన పురాణ వీరుడు. క్రీ. పూ. రెండవ శతాబ్దంలో రచించబడ్డ 'హువాయ్‌నాన్ జు' అనే ఒక పురాణం

ప్రకారం యావో చక్రవర్తి కాలంలో ఆకాశంలో పదిమంది సూర్యులు ఉండేవారు. చెట్టుచేమలను ఈ సూర్యులు మాడ్చివేస్తున్నందువల్ల యావో చక్రవర్తి వారిని పడగొట్టమని 'ఈ'కి ఆజ్ఞాపించాడు. క్రీ. శ. 2వ శతాబ్దంలో వాంగ్ ఇ రాసిన యింకొక పురాణం ప్రకారంగా యీ విలుకాడు తొమ్మండుగురు సూర్యుల్ని మాత్రమే పడగొట్టాడు.

19. షి యు చి (పశ్చిమ యాత్ర) 16వ శతాబ్దపు నవల. దీనిలో నాయకుడు సున్‌వుకుంగ్ అనే మర్కటదేవుడు. అతడు తలచుకొన్నంత మాత్రంలో పక్షి, చెట్టు, రాయి మొదలయిన 72 రూపాలలోనికి మారగలిగేవాడు.

20. లియావో చాయ్ వింతగాథలు 17వ శతాబ్దంలో పుసుంగ్‌లింగ్ రాసినవి. ఇది 431 కథల ప్రసిద్ధ సంకలనం. వీటిలో ఎక్కువ భాగం దెయ్యాల కథలు.

21. కారల్‌మార్క్స్, "పొలిటికల్ ఎకానమీ విమర్శకు ఉపోద్ఘాతం", ఎ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, ఆంగ్ల సం॥, చికాగో, 1904, పే. 310-11.

22. వి. ఇ. లెనిన్, "గతితర్కం గురించి" కలక్టెడ్ వర్క్స్, రష్యన్ సం॥ మాస్కో 1958, 38వ సంపుటి, పే. 358.

23. "పరస్పర వ్యతిరేక విషయాలు పరస్పర పరిపూరకాలు కూడా అవుతాయి" అనే నానుడి పాన్‌కు రాసిన తొలి హాన్ వంశపు చరిత్ర అనే పుస్తకంలో మొదటిసారి వాడబడింది. ఇతడు ఒకటవ శతాబ్దపు పేరుపొందిన చరిత్ర కారుడు. ఇది చాలాకాలంగా ప్రసిద్ధమైన నానుడి.

24. వి. ఐ. లెనిన్, "గతితర్కం గురించి", కలక్టెడ్ వర్క్స్, రష్యన్ సం॥ మాస్కో, 1958, 38వ సంపుటి, పే. 358.

25. వి. ఐ. లెనిన్, "ఎన్.ఐ. బకునిన్ యొక్క పరివర్తనాకాలపు ఆర్థిక వ్యవస్థపై వ్యాఖ్య", కలక్టెడ్ వర్క్స్, రష్యన్ సం॥ మాస్కో, లెనిన్‌గ్రాడ్ 1931, 11 వ సంపుటి, పే. 357.